

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ది తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 279 మంగళవారం, అక్టోబర్ 27 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

నర్సింగ్ కళాశాలల్లో పర్యవేక్షణ కరువు..

డిప్యూటేషన్లపై దుమారం!

■ డిప్యూటేషన్లు, సిబ్బంది కొరత, వసూళ్ల ఆరోపణలతో నర్సింగ్ శాఖపై విమర్శలు



తెలంగాణ జోర్దార్ బ్యూరో

ఉత్తర తెలంగాణలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థుల, బోధనా సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై నర్సింగ్ ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళాశాలల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ కొందరు లెక్చరర్లను డిప్యూటేషన్ పేరుతో ఉన్నత కార్యాలయాల్లో విధులకు కేటాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు సక్రమంగా బోధన అందడం లేదని పలువురు ప్రిన్సిపాళ్లు, ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.ఇటీవల నర్సింగ్ ఆఫీసర్ నుంచి లెక్చరర్‌గా పదోన్నతి పొందిన కొందరికి ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న సీనియర్ సిబ్బందికి తగిన గుర్తింపు, అవకాశాలు దక్కడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లా నుంచి ఓ జూనియర్ సిబ్బందిని డిప్యూటేషన్‌పై నర్సింగ్ డీడీ కార్యాలయానికి కేటాయించడంపై కూడా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది కొరత ఉన్న నర్సింగ్ కళాశాలలకు పంపకుండా హెడ్ ఆఫీస్‌లో విధులు కేటాయించడం వెనుక రాజకీయ పలుకుబడి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సంగారెడ్డి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నుంచి మరో లెక్చరర్‌ను కూడా డీడీ నర్సింగ్ కార్యాలయంలో పనిచేసేందుకు డిప్యూటేషన్‌పై కేటాయించడంపై సిబ్బంది ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. గెజిటెడ్ హోదాలో ఉన్న అధికారులు కార్యాలయాల్లో క్లరికల్ పనులు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని పలువురు ప్రిన్సిపాళ్లు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కార్యాలయ పనులకు సిబ్బంది అవసరమైతే ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను నియమించవచ్చుకదా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మరోవైపు ప్రొఫెసర్ పదోన్నతుల్లోనూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలకే ప్రాధాన్యం లభించిందని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నర్సింగ్ కళాశాలలకు తగిన ప్రాతినిధ్యం దక్కలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇన్‌చార్జి ప్రిన్సిపాళ్ల నియామకాలు, డిప్యూటేషన్ల విషయంలోనూ నచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం అర్హత ఉన్నప్పటికీ తమ విజ్ఞప్తులను తిరస్కరిస్తున్నారని కొందరు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌పై అక్రమ వసూళ్ల ఆరోపణలు కలకలం రేపాయి. ల్యాబ్ ఫీజు, యూనిఫాం ఫీజు, పుస్తకాల ఫీజు పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ ఏబీవీపీ నాయకులు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదనే కారణంతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారని వారు ఆరోపించారు.డబ్బులు చెల్లిస్తేనే పరీక్షల్లో ఉత్తీర్ణత మార్కులు వేస్తామని, లేదంటే ఫెయిల్ చేసి విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తామని బెదిరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని ఏబీవీపీ నాయకులు తెలిపారు. ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఫిర్యాదు చేసిన వారిలో స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కోకన్వీనర్ మారం సందీప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజయ్, నాయకులు అరవింద్, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.

డిప్యూటీ డైరెక్టర్ వివరణ

రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో సక్రమంగా బోధన అందేలా చర్యలు తీసుకుంటున్నామని నర్సింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. సంగారెడ్డి నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌ను ప్రస్తుతం రద్దు చేశామని వెల్లడించారు. అన్ని కళాశాలల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, ఎవరికీ అన్యాయం జరగకుండా సిబ్బందికి న్యాయం

జోర్దార్ ఎఫెక్ట్..

ఓదెల తహసీల్దార్ బదిలీ

కొత్త తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్‌కు బాధ్యతలు



పెద్దపల్లి. జోర్దార్ ప్రతినిధి: ఓదెల మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న గ్రూప్-1 ప్రొబేషనరీ అధికారిని బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఆయన స్థానంలో ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న అధికారిని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.ఓదెల మండలంలో విధులు నిర్వహించిన కాలంలో పలు రిజిస్ట్రేషన్లను పెండింగ్‌లో ఉంచడం, అధికారులు, ప్రజాప్రతినిధులను గౌరవించలేదనే ఆరోపణలు సదరు అధికారిపై వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై జోర్దార్ పత్రికలో వరుస కథనాలు ప్రచురితం కావడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించి సదరు అధికారిని బదిలీ చేసినట్లు తెలుస్తోంది. కాగా, తహసీల్దార్ బదిలీపై మండల ప్రజలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కొత్తగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టనున్న డిప్యూటీ తహసీల్దార్‌తో మండల రెవెన్యూ వ్యవహారాలు మరింత సజావుగా సాగుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

మంచిర్యాల డీఏవోకు అండగా చొప్పదండి డిప్యూటేషన్ వ్యవసాయ అధికారి..

■ తెరవెనుక చక్రం తిప్పుతున్నదెవరు?

■ డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారి జోక్యంపై ఆరోపణలు..

■ కింది స్థాయి సిబ్బందికి ఫోన్లు చేసి ఒత్తిడి ఏ తెస్తున్నారంటూ విమర్శలు!



(మంచిర్యాల/ చొప్పదండి జోర్దార్ ప్రతినిధి)

జిల్లా వ్యవసాయ అధికారిపై జరుగుతున్న విచారణ నేపథ్యంలో ఆయనకు అనుకూలంగా పరిస్థితులను మలిచేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయా? ఇటీవల డిప్యూటేషన్‌పై పక్క జిల్లాకు వెళ్లిన ఓ మండల వ్యవసాయ అధికారి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వ్యవసాయ శాఖలో చర్చనీయాంశంగా మారాయి.గతంలో జిల్లా వ్యవసాయ అధికారికి అత్యంత సన్నిహితంగా ఉంటూ, కొన్ని లావాదేవీల్లో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న సదరు అధికారి, ప్రస్తుతం మరో జిల్లాలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ పాత జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు ఆసక్తి చూపుతున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.మరోవైపు, కింది స్థాయి ఏఈవోలకు ఫోన్లు చేసి విచారణాధికారికి జిల్లా వ్యవసాయ అధికారికి అనుకూలంగా మద్దతు లేఖలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు వెలువడుతున్నాయి. అలా చేయకపోతే పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరుష పదజాలంతో బెదిరిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావడం, విచారణను ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం వంటి అంశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నిజాయితీగా పనిచేసే అధికారులకు తెరవెనుక మంతనాలు, ఇతర సిబ్బందిపై ఒత్తిళ్లు అవసరమా? విచారణ నిష్పక్షపాతంగా సాగాలంటే సంబంధిత అధికారులు తమ వాదనలను ఆధారాలతో సమర్పించాలి. మద్దతు లేఖలు స్వచ్ఛందంగా ఇచ్చినవేనా, ఎవరైనా ఒత్తిడి తెచ్చారా, డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారి ఈ వ్యవహారంలో జోక్యం చేసుకున్నారా అనే అంశాలపై సమగ్ర విచారణ జరగాలి.ఆరోపణలు నిజమో కాదో తేల్చాల్సింది సంబంధిత విచారణాధికారులే. అయితే విచారణ పారదర్శకంగా సాగి, వాస్తవాలు వెలుగులోకి రావడం, కింది స్థాయి ఉద్యోగులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా చూడడం వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల బాధ్యత.

జోర్దార్ ఎఫెక్ట్..

గౌరెడ్డిపేట ఉపాధ్యాయుడికి శోకాజ్ నోటీసు



పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తూ పాఠశాల సమయాన్ని ప్రైవేట్ గొలుసుకట్టు వ్యాపార ప్రచారానికి వినియోగిస్తున్నారంటూ ‘జోర్దార్ తెలుగు దినపత్రిక’లో ప్రచురితమైన కథనంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడికి మండల విద్యాధికారి టి. సురేందర్‌కుమార్ శోకాజ్ నోటీసు జారీ చేశారు.ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ పాఠశాల విధుల సమయంలో ప్రైవేట్ నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రచారాలు, సమావేశాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై నిర్దేశిత గడువులోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. ఉపాధ్యాయుడి వ్యవహారంతో విద్యాబోధనకు ఆటంకం కలుగుతోందని, తోటి సిబ్బందిని సైతం వ్యాపార కార్యకలాపాల్లోకి ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో అధికారులు చర్యలు చేపట్టారు.ఉపాధ్యాయుడు ఇచ్చే వివరణను పరిశీలించిన అనంతరం నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే తదుపరి శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక పంపే అవకాశం ఉన్నట్లు సమాచారం. పత్రికా కథనంపై స్పందించి తక్షణమే శోకాజ్ నోటీసు జారీ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



■ హుజూరాబాద్‌లో వైభవంగా భారీ సైకిల్ ర్యాలీ

హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)సమాజ రక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమర వీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని హుజూరాబాద్ ఏసీపీ వాసంశెట్టి మాధవి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం హుజూరాబాద్ పట్టణంలో భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించి అమర వీరులకు ఘన నివాళులర్పించారు.మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలు అభినంద నీయమని, సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.సీనియర్ సిటిజన్ అయినప్పటికీ ప్రతిరోజూ సైకిల్‌పై ప్రయాణిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్న తులసి లక్ష్మణమూర్తిని ఏసీపీ మాధవి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ టి. కరుణాకర్, రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్, జమ్మికుంట సీఐలు రామకృష్ణ గౌడ్, పులి వెంకటేష్ గౌడ్, పోలీసు అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు సొల్లు సునీత, కోయల్‌కార్ భారతి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుండ్ల చెరువు కాలువకు ఆక్రమణల అడ్డంకి

■ అలైన్‌మెంట్ మార్చి శాశ్వత నిర్మాణాలు

లిచెరువుకు చేరని ఎస్సారెస్పీ నీరు

హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజూరాబాద్ పట్టణంలోని గుండ్ల చెరువుకు నీరందించే ఎస్సారెస్పీ ఉపకాలువ ఆక్రమణలకు గురైందని, దీంతో చెరువుకు సాగునీరు చేరడం లేదని గుండ్ల చెరువు రక్షణ సమితి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ ఆక్రమణలను తొలగించి, చెరువుకు నీరందించేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుండ్ల చెరువు కింద వందల ఎకరాల ఆయకట్టు ఉందని, చేపల పెంపకంపై ఆధారపడి సుమారు 250 ముదిరాజ్ కుటుంబాలు జీవనోపాధి



పొందుతున్నాయని తెలిపారు. ఎస్సారెస్పీ నుంచి వచ్చే 16ఏ ఉపకాలువను పలుచోట్ల ఆక్రమించడంతో పాటు, కాలువ అలైన్‌మెంట్‌ను మార్చి శాశ్వత నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. దీంతో చెరువుకు చేరాల్సిన సాగునీరు చిలుకవాగులోకి వెళ్తోందని పేర్కొన్నారు.
మరోవైపు పట్టణంలోని పలు వార్డుల మురుగు నీరు కాలువలో కలుస్తుండటంతో నీరు కలుషితమై దుర్వాసన వెదజల్లుతోందని, సమీప ప్రాంతాల ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
రెవెన్యూ నక్షా ఆధారంగా సర్వే నిర్వహించి కాలువ ఆక్రమణలను తొలగించాలని, పాత అలైన్‌మెంట్ ప్రకారం కాలువను పునరుద్ధరించాలని కోరారు. మురుగునీరు కాలువలో కలవకుండా ప్రత్యేక డ్రైనేజీ నిర్మించి, ఎస్సారెస్పీ సాగునీటిని గుండ్ల చెరువుకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో గుండ్ల చెరువు రక్షణ సమితి నాయకులు సాయికృష్ణ, అభినయ్, పసుల స్వామి, రైతులు క్యాస రమేష్, కొలిపాక చిన్న, దేవుని సమ్మయ్య, రాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి డిప్యూటీ తహసీల్దార్‌గా

ఆరేపల్లి సుమన్ కుమార్ బాధ్యతల స్వీకరణ



హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)హసన్‌పర్తి మండల రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌గా గ్రూప్-2 (2020) బ్యాచ్‌కు చెందిన ఆరేపల్లి సుమన్ కుమార్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పరకాల ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహించారు.
హసన్‌పర్తిలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ఎం.డి. రహీం పరకాల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుమన్ కుమార్‌ను పలువురు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రామాయణ మహాకావ్యాన్ని అందించిన

మహనీయుడు వాల్మీకి



■ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి)రామాయణ మహాకావ్యాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి యస్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.
వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఆయన కేవలం కవి మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, ధర్మానికి మార్గదర్శి అని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఆయన చూపిన ధర్మ మార్గంలో నడవడమే నిజమైన నివాళి అని అన్నారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి,స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీఓ మేన శ్రీను, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీల్లో సీనియర్లకు చోటేది?

■ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి జోక్యం చేసుకోవాలి

■ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక

సమ్మయ్య



హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షల ఫ్లెక్సీల్లో సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచుల ఫొటోలు లేకపోవడంపై పార్టీలో అసంతృప్తి నెలకొందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య అన్నారు.
ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఫ్లెక్సీల్లో చోటు కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కారణంగా కొందరు సీనియర్లు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, సీనియర్ నాయకులు కోరారు.

తల్లి మృతదేహం వద్ద పాల కోసం కోతిపిల్ల ఆరాటం

■ చూపరులను కంటతడి పెట్టించిన

హృదయవిదారక దృశ్యం

ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)తల్లి చనిపోయిందన్న విషయం తెలియని ఓ కోతిపిల్ల పాల కోసం తల్లి మృతదేహం వద్ద పడిన ఆరాటం చూపరులను కలచివేసింది.మామడ మండలం దిమ్మదుర్తి సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈ హృదయ విదారక దృశ్యం కనిపించింది. తల్లికోతి మృతి చెందడంతో



ఆకలితో ఉన్న పిల్లకోతి పాలు తాగేందుకు తల్లి వద్దకు చేరి ప్రయత్నించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.ఈ దృశ్యం పలువురిని తీవ్రంగా కలచివేసింది.

వాల్మీకి మహర్షి ఆశయాలు

సమాజానికి స్ఫూర్తిదాయకం



■ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కే ఆర్

వరంగల్,(జోర్దార్ ప్రతినిధి)వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..రామాయణ మహాకావ్యాన్ని రచించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలు,ధర్మ మార్గాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. సమాజంలో మానవత్వం, సమానత్వం, సోదరభావం పెంపొందించేందుకు ఆయన బోధనలు దోహద పడతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, భావి తరాలకు మంచి విలువలను అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, వివిధ శాఖల అధికారులు,వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి ఖిల్లాపై

ఎంపీ వంశీకృష్ణ సాహసయాత్ర!



■ 10 కిలోమీటర్ల ట్రెక్కింగ్.. యువతకు సవాల్..

విజేతకు వన్‌ప్లస్ ఫోన్ బహుమతి

■ ఏడు గేట్లు.. రెండు సరస్సులు.. నాలుగు గుట్టలు

దాటి రామాలయం, శివాలయం దర్శనం

రామగిరి, జోర్దార్ ప్రతినిధి:చారిత్రక రామగిరి ఖిల్లాకు పర్యాటక కళ తీసుకురావడమే లక్ష్యంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన సుమారు 10 కిలోమీటర్లు కాలినడకన ట్రెక్కింగ్ చేస్తూ ఖిల్లా ప్రాంతాన్ని సందర్శించారు. ఏడు గేట్లు, రెండు సరస్సులు, నాలుగు గుట్టలను దాటుకుంటూ ఖిల్లా పైభాగానికి చేరుకున్నారు. అక్కడి శ్రీరామచంద్ర స్వామి ఆలయం, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖిల్లాలోని పురాతన కట్టడాలు, ఆలయాలు, ప్రకృతి అందాలను పరిశీలించారు.

యువతకు సవాల్.. గెలిస్తే వన్‌ప్లస్ ఫోన్!
ఖిల్లాపై సాహసయాత్ర చేసిన ఎంపీ వంశీకృష్ణ యువతకు ఆసక్తికరమైన సవాల్ విసిరారు. యువతలో శారీరక దృఢత్వం, సాహస క్రీడలపై ఆసక్తి పెంచే లక్ష్యంతో ట్రెక్కింగ్ సవాల్‌ను ప్రకటించారు.
ఈ పోటీలో విజేతగా నిలిచిన వారికి వన్‌ప్లస్ ఫోన్‌ను బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. ఎంపీ స్వయంగా ఖిల్లాను కాలినడకన అధిరోహించడం యువతలో ఆసక్తిని పెంచే ప్రయత్నంగా నిలిచింది.

రామగిరి ఖిల్లాకు రోప్‌వే.. పర్యాటకానికి కొత్త ఊపు!
రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి రోప్‌వే ఏర్పాటు కీలకమని భావిస్తున్న ఎంపీ వంశీకృష్ణ, ఇందుకు కేంద్ర స్థాయిలో చొరవ తీసుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. రోప్‌వే అందుబాటులోకి వస్తే వృద్ధులు, మహిళలు, పిల్లలు సైతం ఖిల్లాను సులభంగా సందర్శించే అవకాశం ఉంటుంది. పర్యాటకుల సంఖ్య పెరిగితే మంథని ప్రాంతంలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడే వీలుంది.

చారిత్రక వారసత్వానికి ప్రపంచస్థాయి గుర్తింపు లక్ష్యం
పురాతన ఆలయాలు, కోట నిర్మాణాలు, ప్రకృతి అందాలతో ప్రత్యేకత కలిగిన రామగిరి ఖిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అభివృద్ధి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
ఎంపీ వంశీకృష్ణ పర్యటనతో ఖిల్లా విశిష్టత, ట్రెక్కింగ్ అవకాశాలు మరోసారి చర్చకు వచ్చాయి. రోప్‌వే ఏర్పాటు, పర్యాటక సదుపాయాల అభివృద్ధి కార్యరూపం దాల్చితే రామగిరి ఖిల్లాకు మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది.

ముదిరాజుల సమస్యను తీర్చేందుకు, రేవంత్ రెడ్డి

ప్రజా పాలన ప్రభుత్వం సిద్ధంగా ఉంది



■ మంత్రి వివేక్ వెంకటస్వామి.

మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:ముదిరాజుల సమస్యలు తీర్చేందుకు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా పాలన ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు.
ఆదివారం స్థానిక పద్మావతి గార్డెన్స్ లో, జిల్లా అధ్యక్షులు గరిగంటి కొమురయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన "ముదిరాజ్ సింహ గర్జన" కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు, ముదిరాజ్ సామాజిక వర్గం హక్కుల సాధన, అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ , మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మించ తలపెట్టిన ముదిరాజుల భవన నిర్మాణానికి తన నిధుల నుండి 25 లక్షల రూపాయలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, రాష్ట్ర కార్యదర్శి సంకేపల్లి ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, కరీంనగర్, వరంగల్ జిల్లా నాయకులు బల్ల సత్తయ్య, పల్లె బోయిన అశోక్,
మాజీ జిల్లా అధ్యక్షులు ములకలపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు తాళ్ల కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ కార్డుతో యాదగిరికి ఉచిత వైద్యం

■ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఉస్మాన్ పాషా చొరవతో

బిల్లు మాఫీ



మహబూబాబాద్,(జోర్దార్ ప్రతినిధి)సంఘం సీనియర్ సభ్యుడు యాదగిరి చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రి యాజమాన్యం14 లక్షలు చెల్లించాలనే విషయం రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఉస్మాన్ పాషా చొరవతో రాష్ట్ర నాయకులు ఆసుపత్రి ట్రస్టు చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడి హెల్త్ కార్డు అమలయ్యేలా కృషి చేశారు.దీంతో యాదగిరి కుటుంబ సభ్యులు ఎలాంటి నగదు చెల్లించకుండానే డిశ్చార్జ్ అయ్యారని సంఘం ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా ఉస్మాన్ పాషాకు సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 1 తర్వాత అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డు అమలయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.సభ్యులెవరూ నిరుత్సాహపడకుండా హెల్త్ కార్డులు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఈ సందర్భంగా సూచించారు.

లొంగిపోయిన మాజీ మావోయిస్టులకు

రివార్డులు వెంటనే అందించాలి

■ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి మాజీ మావోయిస్టు

సుదర్శన్ విజ్ఞప్తి



రామగిరి,జోర్దార్ ప్రతినిధి:ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టులకు ప్రకటించిన రివార్డులను వెంటనే అందించాలని మాజీ మావోయిస్టు నేత సుదర్శన్ కోరారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు లొంగిపోయిన వారు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ కనీస అవసరాలు తీర్చుకోలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఛత్తీస్‌గఢ్‌లోని తారాలపల్లిలో తన తల్లితో కలిసి సాధారణ జీవితం గడుపుతున్న సుదర్శన్‌కు ఇప్పటివరకు ప్రకటించిన రివార్డు అందలేదని తెలిపారు.
మూడేళ్ల తర్వాత రివార్డు అందిస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ, ఆ హామీ అమలులో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు.
ఈ నేపథ్యంలో రామగిరి మండల తాజా మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్ సుదర్శన్‌ను కలిసి ఆయన పరిస్థితులు, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు.
తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన వారికి రివార్డులు అందించిన తరహాలోనే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతున్న మాజీ మావోయిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, ప్రకటించిన రివార్డులను వెంటనే విడుదల చేయాలని సుదర్శన్ విజ్ఞప్తి చేశారు.
లొంగిపోయిన వారు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడి గౌరవప్రదమైన జీవితం గడిపేలా ప్రభుత్వం సహకరించాలని కోరారు.

తెలంగాణ ఉద్యమకారులను అక్రమంగా

ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికం

- అక్రమ అరెస్టులను ఖండించిన ఉద్యమకారులు.
- హామీలు నెరవేర్చేంతవరకు పోరాటాలు ఆపేది లేదు.
- బెల్లంపల్లి పట్టణ ఉద్యమకారుల డిమాండ్.



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి: జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి, సోమ వారం ఉదయం బయలుదేరుతున్న బెల్లంపల్లి పట్టణ తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేసి నిర్బంధించడము అప్రజాస్వామిక చర్యని, సిగ్గుచేటనీ, బెల్లంపల్లి పట్టణ తెలంగాణ ఉద్య మకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం ఉదయం కస్టడీలోకి తీసుకున్న అనం తరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో కేసులు సైతం లెక్కచేయకుండా తెలంగాణ సాధన కోసం పని చేశామని, ఉద్యమకారులకు ఇచ్చిన వాగ్దానాలు, హామీలు నెరవేర్చకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం ఉ ద్యమకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నా రని,కల్లిబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి న కాంగ్రెస్ ప్రభుత్వం, మూడు సంవత్సరాలు కావవచ్చినా, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా, పోలీస్ స్టేషన్లో బంధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అయినా భయపడి వెనకాడేది లేద ని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడికి ప్రయత్నించిన ఉద్యమకారులను అణిచివేసే విధంగా బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్బంధించటం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.

తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని, లేనియె డల వువ్వెత్తున ఉద్యమ కార్యక్రమాలు రూపుది ద్దుకుంటాయనీ హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, ఇల్లు,రైళ్లలో, బస్సుల్లో ప్రయాణించే దుకు ఉచితంగా పాసులు , ప్రతి ఉద్యమకారునీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిం చాలనీ, 20 లక్షల వరకు వర్తించే హెల్త్ ఇన్సూరె న్స్ కార్డులు జారీ చేయాలనీ డిమాండ్ చేశారు.

అరెస్టు అయిన వారిలో ఎలిగేటి శ్రీనివాస్, పసులేటి వెంకటేష్, ఎరుకల సుందర్రావు, పరిష రవిశ్వర్, విజ్జగిరి రాజేందర్, చిట్యాల మధు, శంకర్ సింగ్ , తదితరులు వున్నారు.

వాల్మీకి మహర్షి జీవితం

ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం కావాలి



- బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం కావాలని భాజపా మంచిర్యాల జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు స్థానిక కోదండ రామా లయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమా లలువేసి, దీపం వెలిగించి, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు మాజీ ఎమ్మె ల్యే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అమురాజుల శ్రీదేవి, రాష్ట్ర సీనియర్ నాయకులు కొయ్యల ఏమాజీ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడు తూ, వాల్మీకి మహర్షి అంటే కేవలం ఒక మహర్షి పేరు మాత్రమే కాదని, ఆయన గొప్ప ఆలోచ నకు, పరివర్తనకు, స్ఫూర్తికి ప్రతీక అని పేర్కొ న్నారు. మహర్షి వాల్మీకిని భారతీయ సాహిత్యంలో ఆదికవిగా గౌరవిస్తామని,ఆయన రచించిన వాల్మీ కి రామాయణం, భారతీయ సంస్కృతి, ధర్మం, నైతిక విలువలకు గొప్ప మార్గదర్శకమని కొని యాడారు.

రామాయణం కేవలం శ్రీరాముని జీవిత కథ మా త్రమే కాదని, జీవితంలో ఎలా నడుచుకోవాలి, కష్టాలను ఎలా ఎదుర్కోవాలి, ధర్మం కోసం ఎలా నిలబడాలి, సమాజం పట్ల మన బాధ్యతలను ఎలా నిర్వర్తించాలి, అనే విలువైన విషయాలను బోధించే మహాకావ్యమని వివరించారు. వాల్మీకి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, మనిషి గతం కంటే అతని పరివర్తన, ఆలోచనలు, ఆచరణ ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. ము ఖ్యంగా యువత వాల్మీకి ఆశయాలను ఆదర్శ ంగా తీసుకొని విద్య, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలకు ప్రాధాన్యతనిస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొల్లెద్ద కేశవరెడ్డి, నర్సింగ్ రాజు, సీహెచ్ స్వామి, కాసిపాక గంగారం, శనిగారపు శ్రావణ్, నస్పూ రి లక్ష్మణ్, గంపల నరేష్,రామ్ హరీష్,డోలే చం ద్ర కాంత్,దుర్గం భరత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో బదిలీలకు బ్రేకులెందుకు?

- పర్చేజ్‌లో ఏం జరుగుతోంది? కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణకు వెనుకడుగు ఎందుకు?
- అధికారుల దీర్ఘకాలిక పోస్టింగులపై మొలుమూరి శ్రీనివాస్ ప్రశ్నల వర్షం



రామగిరి, జోర్దార్ ప్రతినిధి:సింగరేణిలో కార్మికులపై ఉత్పత్తి ఒత్తిడి.. అధికారుల విషయంలో మాత్రం నిబంధనలు ఎందుకు గుర్తుకురావడం లేదు? ఏళ్ల తరబడి ఒకే స్థానాల్లో పాతుకుపోయిన అధికారుల బదిలీలపై యాజమాన్యం ఎందుకు దృష్టి సారించడం లేదు? పర్చేజ్ విభాగంలో కొను గోళ్లు, టెండర్లు, కాంట్రాక్టుల వ్యవహారాలపై ఆరో పణలు వినిపిస్తున్నా సమగ్ర విజిలెన్స్ విచారణ ఎందుకు జరగడం లేదు? అంటూ బీజేపీ పెద్ద పల్లి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని ప్రశ్నించారు.బొగ్గు ఉత్పత్తి పెంచాలంటే కార్మికు లపై ఒత్తిడి పెంచడం ఒక్కటే సరిపోదని, సంస్థలో పారదర్శకత, అధికారుల జవాబుదారీతనం కూ డా పెరగాలని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఒకే స్థానాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులను నిబంధనల ప్రకారం బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

పర్చేజ్ విభాగంపై అనుమానాల మబ్బులు!

సింగరేణి పర్చేజ్ విభాగంలో కొనుగోళ్లు, టెండ ర్లు, కాంట్రాక్టులు, ధరల నిర్ణయాలకు సంబంది ంచి అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ అన్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేల్చాల్సిన బాధ్యత విజిలెన్స్ విభాగంపై ఉందని స్పష్టం చేశారు. అసలు కొనుగోళ్ల వ్యవహారాలపై సంస్థలో అవకతవకల ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై నిష్పాక్షిక విచారణ జరగాల్సిందేనని శ్రీనివాస్ పేర్కొన్నారు. విజిలెన్స్ విభాగం స్వతం త్రంగా పనిచేస్తోందా? ఆరోపణలపై సమర్థవం తంగా స్పందిస్తోందా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.ఆరోపణలను నిర్ధారించకుండా ఎవరినీ దోషులుగా చూడకూడదని, అదే సమ యంలో విచారణ లేకుండా వాటిని పక్కన పెట్టడం కూడా సరికాదని పేర్కొన్నారు.

యాజమాన్యం స్పందిస్తుందా? మౌనమే సమా ధానమా?

దీర్ఘకాలిక పోస్టింగులపై సమీక్ష నిర్వహించాలని, కొనుగోళ్లు, టెండర్ల వ్యవహారాలపై స్వతంత్ర తనిఖీ చేపట్టాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అవసరమైతే ఉన్నతస్థాయి విజిలెన్స్ విచారణ జరిపి, తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబ ంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ ఫలితాలను కూడా ప్రజలకు వెల్లడిం చాలని స్పష్టం చేశారు.సింగరేణి కార్మికుల శ్రమ తో నడిచే ప్రజా సంస్థ. అలాంటి సంస్థలో పార దర్శకతపై ప్రశ్నలు తలెత్తినప్పుడు వాటికి సమా ధానాలు ఇవ్వాల్సిన బాధ్యత యాజమాన్యానిదే. బదిలీలపై సమీక్ష, కొనుగోళ్లపై విచారణ చేపట్టి అనుమానాలకు తెరదించుతారా? లేక ప్రశ్నలు అలాగే మిగిలిపోతాయా? అని మొలుమూరి శ్రీనివాస్ ప్రశ్నించారు.

విజిలెన్స్ నిఘా ఎక్కడ? చర్యలు ఎక్కడ?

ప్రజావాణికి 14 దరఖాస్తులు



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ మం డల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 14 దరఖాస్తులు స్వీకరించారు.వీటిలో రెవెన్యూ శాఖకు 8, మున్సిపాలిటీకి 5, పీఆర్ అండ్ ఆర్డీ శాఖకు ఒక దరఖాస్తు అందాయి.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ఏ. వేణుగోపాల్, తహసీల్దార్ నరేందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధు రెండో విడత

నిధులు విడుదల చేయాలి



ముత్తారం(జోర్దార్ ప్రతినిధి)దళితబంధు రెండో విడత లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చే స్తూ సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు దళి తబంధు సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గద్దల శంకర్, మంథని డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెం డింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి లబ్ధిదా రులకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. అర్హులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితం

సమాజానికి ఆదర్శం



చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో):వాల్మీకి మహర్షి జీవితం యావత్ సమాజానికి ఆదర్శప్రాయమని వాల్మీకి సంఘం మండల కన్వీనర్ నడిగట్ల రమేష్ బాబు అన్నారు. అడ్డతీగల మండల కేంద్రంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను సంఘం నాయకులు మిర్తివాడ రాజబాబు ఆధ్వ ర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమేష్ బా బు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితంలోని మార్పు, తపస్సు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. వాల్మీకి తెగ ప్రజలు ఐక్యంగా ముం దుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వాల్మీకి తెగ ప్రజలు పాల్గొన్నారు.

కొమరం భీం పోరాట స్ఫూర్తితో

బహుజనుల రాజ్యం కోసం పోరాడుదాం

- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య.



మంచిర్యాల జోర్దార్ జిల్లా ప్రతినిధి:కోమురం భీం పోరాట స్ఫూర్తితో బహుజనుల రాజ్యం కోసం పోరాడుదామని, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య పిలుపు నిచ్చారు.భీమ్ 86వ వర్ధంతి సందర్భంగా సోమ వారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొమురం భీం 86వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,నిజాం నిరం కుశ పాలనకు, తెల్ల దొరలకు వ్యతిరేకంగా పోరా డిన ఆదివాసి బిడ్డ, ఆదివాసి హక్కుల కోసం, జెల్, జంగల్, జమీన్, కోసం, గెరిల్లా యుద్ధం చేసి అసువులు బాసిన మహా యోధుడనీ, ఆయ న చేసిన పోరాటాలను, సేవలను కొనియాడారు. కుమురం భీమ్ ఏ ఆశయం సాధన కోసం పోరా టం చేసినాడో,భీమ్ కలలు కన్న ఆశయాలు 86 సంవత్సరాలు గడుస్తున్న నేటికి నెరవేరలేదని, అందుకే కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఆదివా సీల, బహుజనుల, బీసీల, రాజ్యాధికార సాధన కోసం, సామాజిక న్యాయం కొరకు, మరో పోరా టానికి సిద్ధం కావాలని అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చినారు.

ఆదివాసీలకు సంబంధించిన 1/70 పీప, 5వ ,9వ షెడ్యూలు సరైన విధంగా పాలకులు అమ లు చేయడం లేదని, అందుకే ఆదివాసీలు నిరాశ నిస్పృహాల మధ్య జీవితాలను వెల్లదీస్తున్నారని, ఆదివాసీల హక్కులను హరించే విధంగా ప్రభు త్వాలు వ్యవహరించకూడదని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక,సింగరేణి విశ్రాంత నాయకులు మనో హర్ రావు, భాస్కరరావు,

ఏ, రాజేశం, కృష్ణ,సత్తన్న,రెడ్డన్న, శ్యామ్, సత్యనారాయణ, మాధవ రెడ్డి,శంకరన్న తది తరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

- ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



కొత్తగూడెం,(జోర్దార్ ప్రతినిధి)ఖమ్మం--నల్గొం డ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు.

దమ్మపేట మండలంలోని బాలరాజుగూడెం, జగ్గారం, అంకంపాలెం, పట్వారిగూడెం, పార్కల గండి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలిం చారు.అర్హులైన పట్టభద్రులందరూ ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని సూచించారు. గ్రా మాల వారీగా అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రి యను సమన్వయంతో పూర్తి చేయాలని తెలి పారు. పార్టీ శ్రేణుల సమిష్టి కృషితోనే ఎన్నికల్లో విజయం సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, సీనియర్ నాయకులు వాసం శ్రీనివాసరావు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4.40 లక్షల సైబర్ మోసం

రాజస్థాన్‌కు చెందిన నిందితుడి అరెస్ట్



ఆదిలాబాద్(జోర్దార్ ప్రతినిధి)సైబర్ మోసానికి పాల్పడి రూ.4.40 లక్షలు కాజేసిన నిందితుడిని బేల పోలీసులు అరెస్టు చేశారు. కాంగ్రీకి చెందిన బాధితుడి ఫిర్యాదు మేరకు సాంకేతిక విశ్లేషణ చేపట్టిన పోలీసులు రాజస్థాన్‌లోని సలంబర్ జిల్లా తాగర్ గ్రామానికి చెందిన దినేష్ పాటిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నారు.నిందితుడు »violets-cot.compu వెబ్‌సైట్ ద్వారా గర్ల్స్ ఎస్కార్ట్ సర్వీసెస్ పేరుతో రిజిస్ట్రేషన్, హోటల్ ఫీజుల ంటూ నమ్మించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.దేశవ్యాప్తంగా అతనిపై సుమారు 220 సైబర్ క్రైమ్ కేసులు ఉండగా, వాటిలో 20 తెలంగాణకు చెందినవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు.

రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులకు దరఖాస్తులకు ఆహ్వానం

■ బాలల హక్కుల ప్రజా వేదిక అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్.



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 14, బాలల దినోత్సవ సందర్భంగా 14 సంవత్సరాల వయసుగల విద్యార్థులకు 34 రంగాలలో ప్రతిభ కలిగిన వారికి రాష్ట్రస్థాయి బాల మిత్ర అవార్డులు ప్రధానం చేసేందుకు హైదరాబాదులో ఏర్పాటు చేస్తున్నట్టు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ తెలిపారు.
సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, 14 సంవత్సరాల లోపు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు రాష్ట్రస్థాయి లో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. విద్యార్థులు దేశభక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు ప్లేయింగ్, ఫ్లూటు, పర్వతారోహణ, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవిత్వం, జానపద నృత్యం, జానపద పాటలు, మిమిక్రీ, మ్యాజిక్, సైకిలింగ్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాట్మింటన్, చెస్, ఫుట్బాల్, రన్నింగ్, జాతీయ సమైక్యత శిబిరం, కరాటే, కూచిపూడి, కోలాటం, తబలా, బతుకమ్మ , స్విమ్మింగ్, బాస్కెట్బాల్, స్కిటింగ్, టెన్నిస్, అర్చరి, రంగాలలో నైపుణ్యం గల విద్యార్థులకు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్ల ఆధారంగా రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.
దరఖాస్తు చివరి తేదీ నవంబర్5 సాయంత్రం ఐదు గంటల వరకు స్వీకరిస్తారని, నైపుణ్యం గల విద్యార్థులు వారి వద్ద ఉన్న మెరిట్ సర్టిఫికెట్లు ప్రెస్ క్లిప్పింగ్,తో పాటు బయోడేటా దరఖాస్తు వారి ఫోటో జత చేసి దరఖాస్తును పోస్ట్ ద్వారా ఈ అడ్రస్‌కు పంపించాలని తెలిపారు.
వలస సుభాష్ చంద్ర బోస్, రాష్ట్ర బాలల హక్కుల ప్రజా వేదిక అధ్యక్షులు, ఇంటి నెంబర్ 2-92 గ్రామము. కూరెల్ల. మండలం కోహెడ. జిల్లా సిద్దిపేట .పిన్ నెంబర్ 505473 పంపించాలని కోరారు.

కొమురం భీమ్‌కు మంత్రుల నివాళులు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:కెరమెరి మండలం జోడేఘాట్‌లో కొమురం భీమ్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ హాజరై కొమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి, సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు.
ఆదివాసీల హక్కులు, స్వయంపాలన కోసం భీమ్ చేసిన వీరోచిత పోరాటాన్ని స్మరించుకున్నారు. కొమురం భీమ్ త్యాగాలు, ఆశయాలు ఆదివాసీ సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తాయని మంత్రులు కొనియాడారు.

ఆదివాసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: కలెక్టర్

ఆదివాసీల హక్కుల కోసం కొమురం భీమ్ సాగించిన పోరాట స్ఫూర్తితోనే పాలన సాగుతోందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఐటీడీఏ ద్వారా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు. అధికారులతో పాటు ఆదివాసీ నాయకులు సమన్వయంతో ముందుకెళ్తూ ప్రాంతాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పంట నష్ట పరిహారం ఇప్పించాలి

■ రుయ్యాడి రైతులు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:నకిలీ సోయా విత్తనాలతో నష్ట పోయిన తమకు తగిన పరిహారం ఇప్పించాలని అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి రైతులు కోరారు. ఈ మేరకు ఆదిలాబాద్ ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షా కు వినతి పత్రం అందజేశారు. కంపెనీ అధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ పంటను పరిశీలించారని, కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవన్నారు. కంపెనీ నుంచి పరిహారం ఇప్పించాలని, లేదంటే కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమన్నారు.

ప్రజావాణికి 9 దరఖాస్తులు



■ గైర్హాజరైన అధికారుల వివరాలు కలెక్టర్‌కు నివేదిస్తాం
■ ఎంపీడీవో యాదగిరి

సైదాపూర్,జోర్దార్ ప్రతినిధి:సైదాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 9 దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. తహసీల్దార్ విభాగానికి 3, హౌసింగ్ విభాగానికి 5, ఎంపీవో విభాగానికి ఒక దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి గైర్హాజరైన అధికారుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొమురం భీమ్‌కు

మాల సంక్షేమ సంఘం నివాళులు



ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి)మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ చౌరస్తాలో గిరిజన యోధుడు కొమురం భీమ్‌కు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్ మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్‌పై ఆదివాసుల హక్కుల కోసం కొమురం భీమ్ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు.
జోడేఘాట్‌ను కేంద్రంగా చేసుకొని గిరిజనుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారని పేర్కొన్నారు. 1940 అక్టోబర్ 27న జోడేఘాట్‌లో నిజాం సైన్యం చేతిలో కొమురం భీమ్ అమరు డయ్యారని గుర్తుచేశారు.
ఈ కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక పొచ్చన్న, బొమ్మెత సుభాష్, తొగరి ప్రకాష్, పాశం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు?



■ మన్మర్రి గ్రామంలో 10 ఎకరాల్లో వెంచర్
■ నోటీసులిచ్చినా స్పందించని యాజమాన్యం

షాబాద్,(జోర్దార్ న్యూస్):షాబాద్ మండలం మన్మర్రి గ్రామంలోని సర్వే నంబర్ 412లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన వెంచర్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. అవసరమైన అనుమతులు లేకుండానే ప్లాట్ల విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.వెంచర్‌కు సంబంధించిన అనుమతులు, ఇతర వివరాలపై వివరణ కోరుతూ గ్రామ పంచాయతీ అధికారులు ఇప్పటికే మూడు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. చివరిగా అక్టోబర్ 9న నోటీసు ఇచ్చినప్పటికీ యాజమాన్యం నుంచి స్పందన రాలేదని తెలుస్తోంది. అయినా వెంచర్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



కొనుగోలుదారుల్లో ఆందోళన

వెంచర్‌కు లేఅవుట్ అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారం భూమి వినియోగ మార్పిడి జరిగిందా?
అనే అంశాలపై స్పష్టత లేకపోవడ ంతో ప్లాట్లు కొనుగోలు చేసినవారు, కొనుగోలు చేయాలనుకుంటున్నవారు ఆందోళన చెందు తున్నారు.
ఈ నేపథ్యంలో వెంచర్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు, భూ రికార్డులు, ప్లాట్ల విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వెంచర్ అనుమతులపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

సింగరేణి సంస్థను పురోగతిలో నడిపించడానికి ప్రతి ఉద్యోగి నిజాయితీని తన జీవన విధానంగా మార్చుకోవాలి



■ మందమర్రి ఏరియా ఇన్చార్జి జిఎం, జిఎల్ ప్రసాద్.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:సింగరేణి సంస్థను పురోగతిలో నడిపించడానికి, సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి నిజాయితీని తన జీవన విధానంగా మార్చు కోవాలని, మందమర్రి ఏరియా ఇన్చార్జి జి యం, జిఎల్ ప్రసాద్ అన్నారు.
"విజిలెన్స్ అవగాహన వారోత్సవాల" కార్యక్రమాన్ని సోమవారం ఇంచార్జ్ జీఎం ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సి వి సి) ఆదేశాల మేరకు ఈ సంవత్సరం "నిజాయితీతో సమృద్ధి" అనే ప్రధాన నినాదంతో అక్టోబర్ 26 నుండి నవంబర్ 1వ తేదీ వరకు మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, కార్యాలయాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఈ అవగాహన వారోత్సవాలను నిర్వహించుకుంటామని,
ఏ సంస్థ, వ్యవస్థలోనైనా లక్ష్యాలు ఎంత ఉన్నతంగా ఉన్నప్పటికీ, ప్రణాళికలు ఎంత పకడ్బందీగా రూపొందించినప్పటికీ... వాటి అమలులో అవినీతి, అక్రమాలు, అవకతవకలు, అధికార దుర్వినియోగం, చోటు చేసుకుంటే సంస్థ ఆశించిన లక్ష్యాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.
అవినీతి వల్ల ఉద్యోగుల్లో నైతిక ధైర్యం దెబ్బ తింటుందని, ఇది సంస్థ మనుగడకే ప్రమాదకరమని పేర్కొన్నారు.
ప్రతి ఉద్యోగి, అధికారి, విధి నిర్వహణలో పారదర్శకత, నిజాయితీ, జవాబుదారీతనాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.
అక్రమాలు, అవకతవకల నివారణ అత్యంత ముఖ్యమైనదని భావించి సింగరేణిలో ఏర్పాటు చేసిన విజిలెన్స్ విభాగం తనవంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తోందని, ఉద్యోగులను నిరంతరం చైతన్యపరుస్తుందని కొనియాడారు.
సింగరేణి సంస్థను పురోగతి పథంలో నడిపించడానికి, ప్రతి ఒక్కరూ నిజాయితీని ఒక జీవన విధానంగా మార్చుకొని, సంస్థ అభివృద్ధికి పునరంకితం కావాలని కోరారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తో (విజిలెన్స్) పౌరుల సత్య నిష్ఠ ప్రతిజ్ఞ చేపించారు.
ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, అధికారుల సంఘం జాయింట్ సెక్రెటరీ రవి, డి జి ఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, సీనియర్ పి ఓ, సత్యనారాయణ, జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక, జిఎం ఆఫీస్ ఉన్నత అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి మండలంలో

టీఆర్‌పీ పార్టీ జెండా గద్దె ఆవిష్కరణ



■ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజ్యాధికారమే లక్ష్యం
■ రవి పటేల్

మొగుళ్ళపల్లి,(జోర్దార్ న్యూస్):మొగుళ్లపల్లి మండలంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) జెండా గద్దెను జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ, తెలంగాణలోని ప్రతి గ్రామంలో టీఆర్‌పీ జెండా ఎగురవేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయ రాజ్యాధికారం సాధించే వరకు నిరంతర పోరాటం కొనసాగిస్తామని అన్నారు. బహుజన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఆధిపత్య రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు.మొగుళ్లపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో టీఆర్‌పీ జెండా గద్దెలు ఏర్పాటు చేసి, గ్రామ కమిటీలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు ఐక్యంగా ముందుకు సాగి, టీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకత్వంలో బీసీ రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార పాదయాత్ర భూపాలపల్లి జిల్లాకు చేరుకునే సమయానికి ప్రతి గ్రామంలో పార్టీ కమిటీలను ఏర్పాటు చేసి, జెండా గద్దెలను నిర్మించి, పాదయాత్రకు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉంటామని రవి పటేల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా బహుజనులను ఐక్యం చేసి, పాదయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. బహుజనులకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం, రాజ్యాధికారం లభించే వరకు ప్రజా స్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గండు కరుణాకర్, పింగిడి శంకరయ్య, జినుకల శ్రీను, మామిడి శ్రీకాంత్, సామల చంద్ర శేఖర్, మడే సంతోష్, వైద్య లక్ష్మణ్, మొగుళ్లపల్లి మండల నాయకులు గుణికంటి విష్ణు, ఇటుకల ప్రకాష్, రాజేందర్, లక్ష్మణ్, ఇటుకల రాధిక, రవి కుమార్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేద్దాం..... మొక్కలను పెంచుదాం

■ ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి భవిష్యత్తును కాపాడుకుందాం
■ బీసీ జేఏసీ నాయకులు



హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని హుజురాబాద్ నియోజకవర్గ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న పిలుపునిచ్చారు. నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలు అవసరమైనంత నీటినే వినియోగిస్తూ, వర్షపు నీటిని ఒడిసిపట్టాలని, మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రకృతిని కాపాడుతూ భావితరాలకు నీటి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, గొర్రె చిరంజీవి, కే. ఆదాం, కుడికాల ప్రభాకర్, పిట్ట శ్రీనివాస్, తూముల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో నమ్మించి మోసం
మనస్తాపంతో యువతి ఆత్మహత్య



సైదాపూర్,జోర్దార్ ప్రతినిధి:ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువతి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది.
బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఎలాబోతారం గ్రామానికి చెందిన భాషబోయిన సాంబరాజు కుమార్తె అఖిల (24)ను కొండిపర్తి అక్షయ్ అనే యువకుడు ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో అఖిల తీవ్ర మానసిక వేదనకు గురైంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలతో చిట్యాల మండల అభివృద్ధి



■ దొడ్డి కిష్టయ్య

భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:చిట్యాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య అన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో చిట్యాల మండలంలో ఈజీఎస్ కింద రూ.300 కోట్ల అభివృద్ధి పనులు, 400 ఇందిరమ్మ ఇళ్లు, సీసీ రోడ్లు, వంతెన పునర్నిర్మాణం, పాఠశాలలకు నిధులు, ఓపెన్ జిమ్, శ్మశానవాటిక రహదారికి రూ.70 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారని పేర్కొంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమరయ్య, మండల సీనియర్ నాయకులు, గౌడ సంఘం మండల అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, సీనియర్ నాయకులు చిలుముల రాజమౌళి, గుర్రం నరసయ్య, గుర్రపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌జీఆర్ఈఏ 2027 డైరీ
రూపకల్పనపై సమావేశం



హైదరాబాద్,(జోర్దార్ ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌జీఆర్ఈఏ) 2027 నూతన సంవత్సర డైరీ రూపకల్పన, ప్రచురణకు సంబంధించి ఆదివారం రాష్ట్ర సంఘ కార్యాలయంలో డైరీ కమిటీ సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్ పాషా, కమిటీ సభ్యులు తోట రంగయ్య, పి. శరత్ బాబు, జి. వెంకట్ రెడ్డి, ఎ. లక్ష్మీ నరసింహారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి. ప్రహ్లాద రావు పాల్గొన్నారు. డైరీ రూపకల్పన, ప్రచురణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు
న్యాయ విజ్ఞాన సదస్సు



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. వీణప్రణతి ఆధ్వర్యంలో సోమవారం హుజురాబాద్ పట్టణంలోని కాకతీయ కాలనీలో ఉన్న మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడుతూ... బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు విద్యార్థుల్లో చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. పోక్సో చట్టం, మంచి స్పర్శ, చెడు స్పర్శల మధ్య ఉన్న తేడాలు, అసభ్య ప్రవర్తనను ఎలా గుర్తించాలనే కీలక అంశాలను వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా ఏమాత్రం భయపడకుండా వెంటనే ఆ విషయాన్ని తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం తీవ్ర శిక్షార్హమని, ఇలాంటి ఘటనలు జరిగితే దాచిపెట్టకుండా పోలీసులకు, అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గీతా షాజు, డైరెక్టర్ షాజు థామస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మడిపల్లి రైతు వేదికలో
నేడు రైతు నేస్తం శిక్షణ

■ మహిళా సంఘాలు, ఎఫ్‌పీఓ సభ్యులకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుపై అవగాహన

హనన్ పర్తి,జోర్దార్ ప్రతినిధి:రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నేడు మడిపల్లి రైతు వేదికలో మహిళా సంఘాలు,రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) సభ్యులకు కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలు, ఎఫ్‌పీఓలకు ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు,వరి కోత యంత్రాల పంపిణీకి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించ నున్నారు.ఆసక్తి గల రైతులు,మహిళా సంఘాల సభ్యులు,ఎఫ్‌పీఓ ప్రతినిధులు ఉదయం 9:30 గంటలకు మడిపల్లి రైతు వేదికకు చేరుకోవాలని అధికారులు కోరారు

జోర్దార్ కథనానికి స్పందన..
పొలం బాట పట్టిన డైరెక్టర్ గోపి!

■ దుబ్బచెర్లలో 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో పాల్గొన్నరు..



(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, దుబ్బచెర్ల గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ) కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐఏఎస్ పాల్గొని, రైతులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాన్ని పరిశీలించారు.
అనంతరం, భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న విజి లెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. రంగ రెడ్డి, నల్గొండ, సంగారెడ్డి లాంటి జిల్లాలకి బదులు ముఖ్యమంత్రి చెప్పినట్లు మారుమూల జిలాల్లో కూడా పర్యటించి రైతులకు ఎల్ నినో పై రైతులకు ధైర్యాన్ని కల్పించాలని రైతు నాయకులు కోరుతున్నారు.

మంథని మున్సిపల్ పాలకవర్గానికి
ఇనుముల సత్కారం

■ పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి



(మంథని,జోర్దార్ ప్రతినిధి)మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లను న్యాయవాది, మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సతీష్ (సత్యనారాయణ) శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా బాధ్యతలు చేపట్టి ఎనిమిది నెలలు పూర్తవుతున్న సందర్భంగా, ఇటీవల నిర్వహించిన బతుకమ్మ, దసరా వేడుకలు విజయవంతం కావడంపై పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.
ఈ సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ యెల్లంకి వంశీ, 10వ వార్డు కౌన్సిలర్ పెంటరి రాజులను కూడా శాలువాలతో సత్కరించారు. రానున్న రోజుల్లో మంథని పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని, పరిశుభ్రత, పచ్చదనం, పట్టణ సుందరీకరణకు ప్రత్యేక ప్రాధాన్యమివ్వాలని కోరారు.
ఈ కార్యక్రమంలో అందుబాటులో ఉన్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులతో పాటు శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయ డైరెక్టర్ వేల్పుల సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి టౌన్ ఎస్సై రాజశేఖర్‌కు
జెఎస్ఎస్ యూనియన్ ఘన సన్మానం

■ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుమ్ముల రాజశేఖర్‌ను జర్నలిస్టు సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజశేఖర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని కోరారు. పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉండటం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు.ఎస్సై రాజశేఖర్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జెఎస్ఎస్ గౌరవ అధ్యక్షుడు మంద భాస్కర్ యాదవ్, రాష్ట్ర ఈసీ సభ్యుడు కన్నూరి రాజు, వోడ్నాల లత, జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, ఓమేష్, సంతోష్, ఎమ్మార్పీఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కల్వల మల్లేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు

స్కూల్ ఫీజుల ప్రాసీడింగ్‌పై అధికారులను ప్రశ్నించిన
జేఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్

■ ఎమ్మెల్యే విజయరమణారావు జోక్యం.. ప్రాసీడింగ్ జారీ చేయాలని అధికారులకు ఆదేశం



పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్ జారీ అంశంపై జర్నలిస్టు సంక్షేమ సంఘం (జేఎస్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ అధికారులను ప్రశ్నించారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమక్షంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించి, ప్రొసీడింగ్ జారీపై స్పష్టత ఇవ్వాలని కోరారు.ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు, సంబంధిత అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీకి సంబంధించిన ప్రొసీడింగ్ జారీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం.జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించే అంశాన్ని జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధి సమక్షంలో జేఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు నేరుగా ప్రస్తావించడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే స్పందనతో ప్రొసీడింగ్ జారీపై జర్నలిస్టుల్లో ఆశలు నెలకొన్నాయి.

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

■ 9 ఎంపీటీసీ స్థానాల్లో అభ్యర్థులబరి
■ పల్లపు వెంకట్



ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో, చింతూరు:రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి పొత్తులు లేకుండా ఒంటరిగానే పోటీ చేస్తామని మండల కార్యదర్శి పల్లపు వెంకట్ తెలిపారు. సోమవారం కామ్రేడ్ శ్యామల వెంకటరెడ్డి స్మారక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఏజెన్సీ ప్రాంతాల్లో తాగునీరు, సాగునీరు, రోడ్లు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో పేర్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
చింతూరు మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు గాను 9 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ అభ్యర్థిగా మీడియం శ్రీదేవిని ప్రకటించారు.
సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి గ్రామపంచాయతీ
స్ట్రీట్‌లైట్ల పనులపై అనుమానాలు!

■ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచ్ చింతల సుధాకర్, పెరుమాండ్ల కత్తరశాల, అప్పాల భూమేష్ యాదవ్
■ ఒకే పనికి రెండేసి ఎంబి రికార్డులా? రెండేసి బిల్లులా? రెండేసి చెక్కులా? సమగ్ర విచారణకు విజ్ఞప్తి!



(భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి)మేడిపల్లి గ్రామపంచాయతీలో 2019 సంవత్సరంలో స్ట్రీట్‌లైట్ల ఏర్పాటు, కొనుగోళ్లకు సంబంధించిన ఎంబి రికార్డులు, బిల్లులు, చెక్కులు, తీర్మానాల్లో పునరావృతాలు లేదా ఆర్థిక అవకతవకలు జరిగాయనే అనుమానాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మాజీ సర్పంచ్ చింతల సుధాకర్, పెరుమాండ్ల కత్తరశాల, అప్పాల భూమేష్ యాదవ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.
ఒకే పనికి ఒకటి కంటే ఎక్కువ ఎంబి రికార్డులు నమోదు చేశారా? ఒకే పనికి రెండుసార్లు బిల్లులు రూపొందించారా? రెండుసార్లు చెల్లింపులు జరిగాయా? అనే అంశాలను అసలు రికార్డుల ఆధారంగా పరిశీలించి నిజానిజాలు వెలికితీయాలని వారు ఫిర్యాదులో కోరారు.
అలాగే సుమారు రూ.45,000 ప్రస్తుత సర్పంచ్ భర్తకు చెందిన బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు ఆరోపణ/సమాచారం ఉన్న నేపథ్యంలో, ఆ చెల్లింపునకు సంబంధించిన బిల్లులు, తీర్మానాలు, ఎంబి రికార్డులు, చెక్కులు, బ్యాంకు లావాదేవీలను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.
స్ట్రీట్‌లైట్ల పనులకు సంబంధించిన అసలు కొలతల పుస్తకాలు (ఎంబి), బిల్లులు, వౌచర్లు, చెక్కుల కౌంటర్‌ఫాయిల్స్, బ్యాంకు చెల్లింపుల వివరాలు, గ్రామపంచాయతీ తీర్మానాల పుస్తకాలను తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరారు.
విచారణలో ప్రజాధనం దుర్వినియోగం లేదా రెండుసార్లు చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ అయితే, బాధ్యుల నుంచి నిధులను రికవరీ చేసి, వర్తించే చట్టాల ప్రకారం శాఖాపరమైన, అవసరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ప్రజాధనం వినియోగంలో పారదర్శకత ఉండాలి రికార్డుల ఆధారంగా నిజాలు వెలుగులోకి రావాలి! జిల్లా కలెక్టర్ స్పందించి నిష్పాక్షిక విచారణకు ఆదేశాలు జారీ చేసి, విచారణ నివేదికను ఫిర్యాదుదారులకు అందించాలని కోరారు.

సాంస్కృతిక సారథి ఎల్మినో పై కళా ప్రదర్శన



(రామడుగు జోర్దార్ ప్రతినిధి)జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు, డిపిఆర్ఓ గారి పర్యవేక్షణలో సోమవారం రోజున రామడుగు మండలం వన్నారం గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి గొల్లపల్లి శ్రీకాంత్ 15 మంది కళాబృందం రాష్ట్ర ప్రభుత్వం ఎల్మినో ప్రభావం వలన రుతుపవనాలు తగ్గి సరియైన వానలు కురవని కారణంగా ప్రజలందరూ కూడా నీటిని, విద్యుత్ పొదుపుగా వాడాలని రానున్న కాలంలో బావులు బోర్లు నీటి ఊటలు తగ్గే అవకాశం ఉన్నది కావున రైతులు ఆరుతడి పంటలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పాటల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు.
కళాకారులు గొల్లపల్లి శ్రీకాంత్, దుర్గశీమురళి, ఎర్రవెల్లి శంకర్, ఖైరీ తిరుపతి,
రామడుగు అశోక్, శ్రీనివాస్, వాణి, స్నేహ, అమూల్య,ఝాన్సీ లావణ్య, శ్రీలత, అర్చన, మాధవి, ఉదయ, తదితరులు కళాకారులు పాల్గొన్నారు

దుబ్యాలలో వివో, అంగన్‌వాడీ
భవనాల నిర్మాణానికి శ్రీకారం



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం దుబ్యాల గ్రామంలో నూతనంగా నిర్మించనున్న వివో భవనం, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ సంగీ అంజలి అధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా ముగ్గు పోసి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎపీఎం మంజుల హాజరై, వివో భవనం అందుబాటులోకి రావడం ద్వారా మహిళా సంఘాల బలోపేతానికి, అంగన్‌వాడీ భవనం ద్వారా చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. భవనాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సర్పంచ్ అంజలి పేర్కొన్నారు.
కార్యక్రమంలో వివో అధ్యక్షురాలు, సభ్యులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ సంగీ రవి, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు వాతావరణ పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి



జోగులాంబ గద్వాల్,(జోర్దార్ ప్రతినిధి)అలంపూర్ నియోజకవర్గ రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ సూచించారు. వర్షాభావంతో పంటలు ఎండిపోతూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఎండల నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న పరిస్థితుల్లో రైతులు వర్షాధార పంటల సాగుపై ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

నీతులు ఉచితాలే కదా

ఇక్కడ అందరూ నీతిచంద్రికలే
తాము మాత్రం నీళ్లను నీళ్లలా ఖర్చు పెడతారంట
ఎటొచ్చీ ఎదుటివారే
అందునా రైతు... ఆదా చేయాలంట నీటిని

నీటిని అదా చేయడమంటే
రైతు ఆదాయం కోల్పోవడమే కదా...

అంటే తనని నమ్ముకున్నోళ్లను
పరోక్షంగా పస్తులుండమనే కదా...

నీతులు చెప్పేవారి మొఖం చూడండి
ప్రవచనకర్తలా... ప్రశాంతంగా...

వారు మెడలేసే దండకు,
బుజాలపై కప్పే శాలువాకు ఎదురుచూస్తున్నారు

ఎందుకు ఎదురుచూడరు
వాళ్లకు అదొక్కటే తక్కువ
ఎందుకంటే వాళ్ళు శాసనాపతులు కదా...
వారికి ఆరెంకలజీతమూ అల్పమే

వారికి ఎదుటివారు చెప్పే నీతులు వినే తీరికలేదు
వుంటే... జనచంద్రిక తెలిసిఉండేది
పంటి బిగువున ఆపిన
కంటనీరు రుచి తెలిసి ఉండేది
ఆకలితో మండిన
కడపు మంట సెగ తగిలి ఉండేది

మాయమాటల నమ్మి రైతు
మన్ననను మచ్చిక చేసుకోడం ఆపేసి
తానే ఓ నినాదంలా రగులుతున్నాడు

మంత్రులు, అధికారులు
తలా ఓ ఆర్నెల్లు ఎల్నీవో పేరుతో
ఉద్యోగాలు బంద్ చేయమని

- రాపాక శ్రీనివాస్

రామగుండం లో విచ్చలవిడిగా మాంసం విక్రయాలు

- **మున్సిపల్ ముద్ర లేదు... జీవాల పరీక్షలు లేవు..**
- **పాంచి ఉన్న జూనోసిస్ వ్యాధులు..**
- **స్లాటర్ హౌస్ వినియోగంలో బల్దియా నిర్లక్ష్యం**



(రామగుండం జోర్దార్ ప్రతినిధి)రామగుండం పారిశ్రామిక ప్రాంతా ప్రజలకు జూనోసిస్ వ్యాధులు పొంచి ఉన్నాయి. జీవాల పరీక్షలు లేకుండానే... గత రెండేళ్లుగా రామగుండం నగర పాలక పరిధిలో మాంసం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.

మాంసం చుట్టూ వందల రకాల జూనోసిస్ వ్యాధులు తిరుగుతున్నాయని పశు వైద్య విశ్వ విద్యాలయం అధికారులు ప్రకటించారు. సుమారు 2 లక్షల పైచిలుకు జనాభా కలిగిన నగరంలో కిలోకు రూ.800 ఖర్చు చేస్తున్నా నాణ్యమైన మాంసం తిన్నామనే ధీమా లేకుండా పోతుంది. రెండేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారులు దుకాణాల వద్దనే జీవాలను వధించి మాంసంను విక్రయిస్తున్నారు.

అయితే జీవాలను ముందుగా మున్సిపల్ పశు వైద్యాధికారులు పరీక్షించాలి. పధించిన తర్వాత మాంసంను మళ్లీ పరీక్షించి అధికారిక ముద్ర వేశాకే విక్రయాలకు అనుమతి ఇవ్వాలి. ఈ పద్ధతికి తిలోదకాలు ఇవ్వడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

కొరవడిన మున్సిపల్ పర్యవేక్షణ..

నగర పాలక పరిధిలోని రామగుండం, ఎన్టీపీసీ, గోదావరిఖని, యైటింక్లయిన్ కాలనీలో గల వందలాది మాంసం విక్రయ దుకాణాలపై మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. సప్తగిరి కాలనీ శివారులో రూ.40లక్షలతో నిర్మించిన స్లాటర్ హౌస్ లో దొంగలు పడి విలువైన సొత్తు ఎత్తుకెళ్లాక వినియోగంలోకి రాకుండా పోయింది. ఇదే అదనుగా కొంతమంది వ్యాపారులు ఆరోగ్యంగా లేని తక్కువ ధరకు వచ్చే మేకలు, గొర్రెలు తీసుకవచ్చి షాపుల వద్దనే వధించి విక్రయిస్తున్నారు. ఇందులో 60శాతం అనధికారికంగా విక్రయిస్తున్నారు. నిబంధనలు పాటించే వారి సంఖ్య 40 శాతంకు మించదు. నగరంలోని పలు చోట్ల విక్రయించే మేక మాంసం ధరల్లో తేడాలు ఉండటమే ఇందుకు నిదర్శనం. గతంలో జరిపిన తనిఖీల్లో నాణ్యత లేని మాంసం పట్టుబడిన సంఘటనలు ఉన్నాయి.

స్థానిక మేకల మార్కెట్‌లో జబ్బులు పడిన మేకలు, మహారాష్ట్ర ఇతర ప్రాంతాల నుంచి అనారోగ్యంతో ఉన్న జీవాలను తక్కువ ధరకు తీసుకొచ్చి వాటిని వధించి విక్రయించడం వినియోగదారుల పాలిట శాపంగా మారుతోంది. ఈ దసరా పండుగ వేళ విచ్చలవిడిగా మాంసం విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. ఇకనైనా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వీడి జీవ పరీక్షల విధానంను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఫిర్యాదులు వచ్చినప్పుడేనా...?

ఎక్కడైనా పాడైన మాంసం అమ్మితే మున్సిపల్ అధికారులు హడావిడిగా దాడులు చేస్తున్నారు. కానీ చాలామట్టుకు ఇవి బయటకు పొక్కకుండా వ్యాపారులు రింగుగా మారి సెటిల్మెంట్లు చేస్తున్నట్లు ప్రచారంలో ఉంది. పండగ, సెలవు దినాల్లో బల్దియా పరిధిలో వేల సంఖ్యలో గొర్రెలు, మేకలు వధిస్తుంటారు.

త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం:

నాయిని వెంకటస్వామి, కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్, స్లాటర్ హౌస్ రీ కన్స్ట్రక్షన్ జరుగుతోంది. త్వరలోనే వినియోగంలోకి తీసుకవస్తాం. షాపుల వద్ద నాణ్యత లేని మాంసం విక్రయాలు జరగకుండా పర్యవేక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

శానిటరీ ఇన్స్పెక్టర్లు, జవాన్లు నిరంతరం తనిఖీలు చేసేలా ఆదేశిస్తాం. నాణ్యత లేని మాంసం విక్రయిస్తే మున్సిపల్ ఆఫీసులో ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

బాలికను దూషించడంపై ప్రశ్నించిన బాలుడిపై కర్రతో దాడి



- **కుర్వగూడలో ఘటన**
- **నిందితుడిని రిమాండ్**

చేవెళ్ల,(జోర్దార్ ప్రతినిధి)బాలికను అసభ్య పదజాలంతో దూషించడంపై ప్రశ్నించిన బాలుడిపై ఓ వ్యక్తి చెక్క కర్రతో దాడి చేసిన ఘటన షాబాద్ మండలం కుర్వగూడలో చోటుచేసుకుంది. ఈ దాడిలో బాలుడి తల, ఎడమ చెంపకు గాయాలయ్యాయి.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 24న బాలికను నిందితుడు దూషించడంతో ఆమె సోదరుడు ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా, నిందితుడు కర్రతో బాలుడిపై దాడి చేశాడు. గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు శంషాబాద్‌లోని అర్కామ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

ఇంట్లోకి చొరబడి దాడి.. ముగ్గురికి రిమాండ్



- **మొబైల్ ఫోన్ వివాదమే కారణం**
- **వ్యాపారి, కుటుంబ సభ్యులకు గాయాలు**

చేవెళ్ల,(జోర్దార్ ప్రతినిధి):మొబైల్ ఫోన్ వివాదంతో ఇంట్లోకి చొరబడి వ్యాపారి, ఆయన కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటన షాబాద్ మండలం నాగర్‌గూడలో చోటుచేసుకుంది. ఈ నెల 22న రాత్రి వ్యాపారి ఆర్డా శ్రీనివాస్ రెడ్డి (38) ఇంట్లోకి ఆయన డ్రైవర్ ఖలీల్, బావమరిదులు ఆదిల్ (23), అద్నాన్ (22) ప్రవేశించి కర్రలతో దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటనలో శ్రీనివాస్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు, సోదరుడు శేఖర్ రెడ్డి గాయపడ్డారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన షాబాద్ పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి



జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)అయిజ మండల కార్యాలయంలో సమగ్రతా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో జి. కృష్ణయ్య, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అవినీతికి దూరంగా ఉంటూ విధులను నిజాయితీ, నిబద్ధతతో నిర్వహించాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలందించాలని అధికారులు సూచించారు.

తెలంగాణలో విదేశీ వైద్య పట్టభద్రుల ఆత్మగౌరవ ప్రదర్శన

జలవిహార్ నుండి ప్రజా వేదిక వరకు శాంతియుత కవాతు

- **నెలకు 29,792 రూపాయల సమాన భత్యం ఇవ్వాలి -**
- **మూడు ప్రధాన డిమాండ్లతో ప్రభుత్వానికి వినతిలి**



హైదరాబాద్,జోర్దార్ ప్రతినిధి:

1. రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల ఐక్య కవాతు:

తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఇంటర్న్ షిప్ చేస్తున్న విదేశీ వైద్య పట్టభద్రులు అందరూ హైదరాబాద్ లోని జలవిహార్ వద్ద సమావేశమయ్యారు. అక్టోబర్ 17న సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల 30 నిమిషాల వరకు జలవిహార్ నుండి ప్రజా వేదిక వరకు శాంతియుతంగా కవాతు నిర్వహించారు.

ఈ కవాతులో వారు తమ సమస్యలను, తమ వ్యక్తిగత అనుభవాలను, భత్యంలో అసమానతలు మరియు ఇంటర్న్ షిప్ పరిస్థితులపై ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు, మాధ్యమ ప్రతినిధులకు వివరించారు.

2. మూడు ప్రధాన డిమాండ్లు:

మొదటి డిమాండ్ - సమాన భత్యం:

భారతీయ వైద్య పట్టభద్రులతో సమానంగా, అర్హులైన విదేశీ వైద్య పట్టభద్రుల ఇంటర్న్ లకు కూడా నెలకు 29,792 రూపాయల భత్యం చెల్లించాలి.

రెండవ డిమాండ్ - పెండింగ్ బకాయిల విడుదల:

జనవరి 2026 నుండి ఇప్పటి వరకు పెండింగ్ లో ఉన్న అర్హులైన బకాయిలన్నింటినీ సమాన భత్యం రేటు ప్రకారం వెంటనే విడుదల చేయాలి.

మూడవ డిమాండ్ - ప్రతీకార చర్యలు వద్దు:

శాంతియుతంగా నిరసన తెలిపినందుకు ఇంటర్న్ షిప్ కాలాన్ని అన్యాయంగా పొడిగించడం లేదా శిక్షార్హమైన చర్యలు తీసుకోవడం చేయకూడదు.

3. ప్రభుత్వానికి విజ్ఞప్తి - లిఖితపూర్వక ఉత్తర్వులు ఇవ్వాలి:

ఈ డిమాండ్లను పరిష్కరించడానికి ఆరోగ్య శాఖ మరియు సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, అధికారిక లిఖితపూర్వక ప్రభుత్వ ఉత్తర్వును వెంటనే జారీ చేయాలని ఇంటర్న్ లు వేడుకుంటున్నారు.

తమ న్యాయమైన డిమాండ్లు అధికారిక లిఖిత పూర్వక హామీ ద్వారా నెరవేరే వరకు తమ శాంతియుత పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

ఈ కవాతు తెలంగాణ విదేశీ వైద్య పట్టభద్రుల ఐక్యతను, న్యాయం కోసం వారి పట్టుదలను చాటి చెప్పింది.

ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ వ్యాపారం!

ప్రభుత్వ జీతం.. ప్రైవేట్ వ్యాపారం! గౌరెడ్డిపేట బడిలో

ఉపాధ్యాయుడి దందా?

- జీతం ప్రభుత్వానిది.. సేవ గొలుసుకట్టు కంపెనీకే...
- నాలుగు చక్రాల కానుక కోసం బడిని పణంగా పెట్టిన ఉపాధ్యాయుడు



- **జోర్దార్ కథనానికి స్పందన.. గారెడ్డిపేట ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు**
- **వివరణ కోరిన పెద్దపల్లి ఎంఈఓ.. తదుపరి చర్యలపై ఉత్కంఠ**

పెద్దపల్లి, అక్టోబర్ 27 (జోర్దార్ ప్రతినిధి)ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు.. బోధనను పక్కనపెట్టి ప్రైవేట్ వ్యాపార కార్యకలాపాలకు ప్రాధాన్యమిస్తున్నారన్న ఆరోపణలపై విద్యాశాఖ స్పందించింది. పెద్దపల్లి మండలం గారెడ్డిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిపై 'జోర్దార్ తెలుగు దినపత్రిక'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన పెద్దపల్లి మండల విద్యాధికారి (ఎంఈఓ) టి. సురేందర్ కుమార్.. సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

బడి వేళల్లో వ్యాపార కార్యకలాపాలా?

ప్రభుత్వం నుంచి జీతం పొందుతూ.. పాఠశాల పని వేళల్లో ప్రైవేట్ నెట్‌వర్క్ మార్కెటింగ్ సంస్థ 'వెస్టీజ్' ప్రచారాలు, సమావేశాలకు సమయం కేటాయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా, తోటి సిబ్బందిని సైతం వ్యాపార కార్యకలాపాల వైపు ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై నిర్దేశిత గడువులోగా లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఎంఈఓ జారీ చేసిన నోటీసులో పేర్కొన్నట్లు సమాచారం.

వివరణ ఆధారంగా తదుపరి చర్యలు!

ఉపాధ్యాయుడి వ్యవహారంతో విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. సదరు ఉపాధ్యాయుడు సమర్పించే వివరణను పరిశీలించిన అనంతరం, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే తదుపరి శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పత్రికలో కథనం ప్రచురితమైన వెంటనే ఎంఈఓ స్పందించి షోకాజ్ నోటీసు జారీ చేయడంపై స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఉపాధ్యాయుడి వివరణ అనంతరం విద్యాశాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది వేచి చూడాలి

ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పనిచేస్తున్న యువకుడు అదృశ్యం

- **ఆచూకీ కోసం పోలీసుల గాలింపు**



హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కూలీ పనులు చేస్తున్న అమన్‌సింగ్ (21) అనే యువకుడు అదృశ్యమయ్యాడు.ఈ నెల 21వ తేదీ రాత్రి కళాశాల వద్ద నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది కృష్ణ ప్రతాప్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా,కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. అమన్‌సింగ్ ఈ నెల 21న రాత్రి వెళ్లినప్పటి నుంచి తిరిగి రాలేదు.22వ తేదీ నుంచి అతని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉందని దీంతో పోలీసులు యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదృశ్యమైన యువకుడి వయస్సు 21 సంవత్సరాలు,ఎత్తు సుమారు 5.5 అడుగులు, నల్లటి టీషర్ట్,నిక్కర్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు వెంటనే హసన్‌పర్తి పోలీసులకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు. సమాచారం కోసం ఇన్‌స్పెక్టర్ 8712685124, ఎస్ఐ 8712685097, 8712685098, పోలీస్‌స్టేషన్ 8712685015 సంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పలు కుటుంబాలను పరామర్శించిన కీర్తి రెడ్డి



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రాఘవపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాల్ల కొమురయ్య కుటుంబాన్ని, సోమనపల్లి గ్రామంలో ఇటీవల పరమపదించిన అబ్బెంగల లస్మయ్య కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి సోమవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఈ కష్టకాలంలో కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను కోల్పోవడం ఎంతో బాధాకరమని, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని కీర్తి రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, బూత్ అధ్యక్షుడు మంద వెంకటేష్, రమేష్, మండల నాయకులు రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్ దొంగిలించిన బంగారం వెండి స్వాధీనం



- **తెలంగాణ,ఏపీ,కర్ణాటకలో 43 కేసులు**
- **డీఎస్పీ మొగులయ్య వెల్లడి**

జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి)పగటిపూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నేరస్థుడు వడ్డే పీట్ల గంగాధర్ (31)ను శాంతినగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 43 కేసులు నమోదైనట్లు డీఎస్పీ మొగులయ్య వెల్లడించారు.సోమవారం శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన గంగాధర్ ఈ నెల 14న శాంతినగర్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో చోరీకి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, సోమవారం తెల్లవారుజామున అలంపూర్ చౌరస్తా వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.చోరీకి గురైన 20 తులాల బంగారంలో 10 తులాలను స్వాధీనం చేసుకున్నామని, మిగిలిన బంగారాన్ని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైందని డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.ఈ సమావేశంలో సీఐ శంకర్, ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీత అంతం - మా పంతం
మంగళవారం,
అక్టోబర్ 27 2026

వాళ్లే గెలిపించారు.. ఓడిపోయి ఉంటే ఏం జరిగేదంటే..?



: క్రైస్ట్ చర్చ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్ క్రికెట్ అభిమానులను చివరి వరకు ఉత్కంఠగా చూసేలా చేసింది. నువ్వా నేనా అన్నట్లుగా సాగిన ఈ పోరులో టీమిండియా 4 వికెట్ల తేడాతో సంచలన విజయాన్ని అందుకుంది. ఒక దశలో ఓటమి తప్పదనుకున్న చోట, యువ ఆటగాళ్లైన తెలుగు తేజాలు నితీష్ కుమార్ రెడ్డి, తిలక్ వర్మ అద్భుతమైన పోరాట పటిమతో మెరిశారు.నితీష్ కుమార్ రెడ్డి 26 పరుగులు చేయగా, తిలక్ వర్మ 51 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. ఆఖరి ఐదు ఓవర్లలో ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్ కలిసి ఏకంగా 68 పరుగులు సాధించి భారత జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత్ 2-0 తేడాతో ముందంజ వేసింది. వీరితో పాటు నమన్ ధీర్ కూడా అద్భుతంగా ఆడాడని, మిడిల్ ఓవర్లలో స్కోర్ బోర్డును తగ్గకుండా చూసుకుని గెలుపులో కీలక పాత్ర పోషించాడని కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రశంసించారు.ఈ మ్యాచ్ టీమిండియా ఆడిన 300వ టి20 మ్యాచ్ కావడం విశేషం. ఈ అరుదైన మైలురాయి మ్యాచ్‌లో విజయం సాధించడంపై కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఆయన మాట్లాడుతూ, ఇలాంటి ఉత్కంఠభరిత పోరులో విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. "మా జట్టులో ప్రతి ఒక్క ఆటగాడికి ఒంటి చేత్తో మ్యాచ్‌ను గెలిపించే సత్తా ఉంది. ఈ మ్యాచ్‌లో మరోసారి అది నిజమని నిరూపించారు" అని శ్రేయస్ పేర్కొన్నారు.ఒకే ఓవర్‌లో వరుసగా రెండు వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ తమ చేతుల్లోంచి చేజారిపోతుందేమో అని అనిపించిందని అయ్యర్ వెల్లడించారు. అయితే, "తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి అద్భుతమైన పోరాట పటిమను కనపరిచారు. ఓడిపోయే మ్యాచ్‌ను మా వైపు తిప్పుకొని అద్భుతంగా గెలిపించారు" అని ఆయన కొనియాడారు. 300వ టి20 మ్యాచ్‌లో విజయం సాధించడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని, ఒకవేళ ఓడిపోయి ఉంటే కాస్త నిరాశ కలిగి ఉండేదని శ్రేయస్ అయ్యర్ అభిప్రాయపడ్డారు.ఈ విజయం జట్టుకు మంచి బూస్ట్‌ను ఇచ్చిందని శ్రేయస్ అన్నారు. "ఈ మ్యాచ్ గెలవడంతో మాకు మంచి బూస్ట్ లభించింది. తర్వాత మ్యాచ్‌లో ఎటువంటి టెన్షన్ లేకుండానే గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంటామనే భరోసా వచ్చింది. ఒకవేళ ఓడింటే పెద్ద సమస్యగా మారేది" అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చారు. అలాగే, ఈ మ్యాచ్‌లో నమన్ ధీర్ మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడాడని, అతడు అద్భుతమైన ఆల్ రౌండర్ అని, బ్యాట్‌తో పాటు బంతితోను రాణించగలడని, ఫీల్డింగ్‌లోనూ యాక్టివ్‌గా ఉంటాడని, ఖచ్చితంగా జట్టుకు ఎక్స్ ఫ్యాక్టర్

మీకు తెలియకుండా బ్యాంక్ అకౌంట్లో డబ్బులు కట్ అయ్యాయా..?



భారత స్టాక్ మార్కెట్‌లో కొన్ని కంపెనీల షేర్లు దీర్ఘకాలంలో అద్భుతమైన రాబడులను అందిస్తూ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. అలాంటి కంపెనీల్లో ఒకటి. కండోమ్‌లు, ఇతర నిరోధక ఉత్పత్తులను తయారు చేసే ఈ కంపెనీ షేరు గత పదేళ్లలో సుమారు 14,057 శాతం రాబడిని అందించినట్లు నివేదికలు చెబుతున్నాయి. దీంతో ఈ స్టాక్ మరోసారి మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది.

కుపిడ్ లిమిటెడ్ అంటే ఏమిటి?కుపిడ్ లిమిటెడ్ భారతదేశానికి చెందిన ఒక తయారీ సంస్థ. ఈ కంపెనీ పురుషుల కండోమ్‌లు, మహిళల కండోమ్‌లు, నీటి ఆధారిత లూబ్రికెంట్ జెల్లీ, వైద్య పరీక్షలకు ఉపయోగించే ×ఱ కిట్లను తయారు చేస్తుంది. కంపెనీకి స్వంత పరిశోధన, అభివృద్ధి కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలోనూ తన ఉత్పత్తులను విక్రయిస్తోంది.పదేళ్లలో 14,057 శాతం రాబడి.. ఎంత పెరిగింది?కుపిడ్ లిమిటెడ్ షేరు పదేళ్ల కాలంలో సుమారు 14,057 శాతం రాబడిని అందించింది. అంటే, షేరు ధరలో వచ్చిన పెరుగుదల దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు గణనీయమైన లాభాలను అందించింది. అయితే, ఈ రాబడి గత పనితీరుకు సంబంధించినది మాత్రమే. భవిష్యత్తులోనూ ఇదే స్థాయిలో లాభాలు వస్తాయని హామీ లేదు.కుపిడ్ లిమిటెడ్ షేరు బీఎస్‌ఈలో సుమారు 3 శాతం పెరిగి రూ.368 స్థాయిలో కొత్త గరిష్ఠాన్ని తాకింది.కాలవ్యవధి నివేదించిన షేరు పెరుగుదల, రాబడి

ఒక నెలలో సుమారు 28%, ఆరు నెలల్లో 289% కంటే ఎక్కువ, అదే ఒక సంవత్సరంలో 650% కంటే ఎక్కువ, రెండు సంవత్సరాలలో సుమారు 2,121%, మూడు సంవత్సరాలలో సుమారు 8,605%, ఐదు సంవత్సరాలలో సుమారు 15,301% శాతం పెరుగుదల నమోదైనట్లు కంపెనీ నివేదికలు చెబుతున్నాయి. కండోమ్‌లు, ఇతర వ్యక్తిగత ఆరోగ్య ఉత్పత్తులను తయారు చేసే కుపిడ్ లిమిటెడ్ షేరు గత పదేళ్లలో అందించిన భారీ రాబడితో ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షించింది. అయితే, గతంలో వచ్చిన లాభాలు భవిష్యత్తులోనూ వస్తాయని చెప్పలేం. పెట్టుబడి పెట్టే ముందు పూర్తి వివరాలను పరిశీలించి, అవసరమైతే ఆర్థిక సలహాదారుని సంప్రదించాలి.బోనస్ షేర్లను ఎప్పుడు, ఎక్కడ ఇచ్చారు? ఈ కంపెనీ తన వాటాదారులను చాలా సంతోషపెట్టింది. ఈ కంపెనీ మార్చి 2026లో ఒక షేరుకు 4 (1:4) బోనస్ షేర్లను ఇచ్చింది. అంతకుముందు, 2024లో 1:1 నిష్పత్తిలో, 2018లో 5:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ఇచ్చారు.

టీమిండియా ఎఫెక్ట్.. న్యూజిలాండ్ సంచలన నిర్ణయం..!

టీమిండియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల ఽ20 సిరీస్‌లో న్యూజిలాండ్ జట్టు వరుస ఎదురుదెబ్బలు ఎదుర్కొంటుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలై సిరీస్‌లో 0-2తో వెనుకబడిన కివీస్, మిగిలిన మ్యాచ్‌ల కోసం తమ పేస్ బౌలింగ్ విభాగంలో గణనీయమైన మార్పులు చేసుకుంది. బిజీ అంతర్జాతీయ షెడ్యూల్స, ఆటగాళ్ల పని భారాన్ని దృష్టిలో ఉంచుకొని పలువురు స్టార్ ఫాస్ట్ బౌలర్లకు విశ్రాంతినిచ్చి, యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలని న్యూజిలాండ్ బోర్డు నిర్ణయించింది.ఈ మార్పుల ప్రకారం, స్టార్ పేసర్ లాకీ ఫెర్గుసన్‌కు వెల్లింగ్టన్‌లో జరిగే మూడో ఽ20 మ్యాచ్‌కు విశ్రాంతినిచ్చారు. అలాగే, మరో ప్రధాన పేసర్ మ్యాట్ హెన్రీ చివరి మూడు ఽ20 మ్యాచ్‌లకు దూరంగా ఉండనున్నాడు. రాబోయే వన్డే సిరీస్‌లకు సన్నద్ధం కావడానికి అతనికి విశ్రాంతి కల్పించినట్లు జట్టు యాజమాన్యం పేర్కొంది.వారి స్థానంలో, తొలి రెండు ఽ20 మ్యాచ్‌లకు దూరమైన కైల్ జేమ్సన్ మూడో మ్యాచ్ కోసం వెల్లింగ్టన్‌లో జట్టుతో కలవనున్నాడు. అలాగే, బ్లేయర్ టిక్నర్ కూడా న్యూజిలాండ్ జట్టులోకి వచ్చాడు. ఇక, నాలుగు, ఐదవ మ్యాచ్‌ల కోసం యువ ఆటగాడు జోష్ క్లార్క్సన్‌ను జట్టులోకి తీసుకుంది న్యూజిలాండ్ బోర్డు. ఈ మార్పులను న్యూజిలాండ్ ప్రధాన కోచ్ రాబర్ట్ వాల్టర్ అధికారికంగా



వెల్లడించారు.మూడవ ఽ20 మ్యాచ్ ఈ నెల 27వ తేదీన వెల్లింగ్టన్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ ఇరు జట్లకు ఎంతో కీలకం. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే సిరీస్‌ను వశం చేసుకుంటుంది. సిరీస్ కోల్పోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్ ఈ మ్యాచ్ తప్పక గెలవాల్సిన పరిస్థితుల్లో ఈ మార్పులు చోటు చేసుకున్నాయి.

గోల్డ్ లవర్స్‌కి పెద్ద ఊరట.. మళ్లీ దిగొచ్చిన ధరలు



దీపావళి పండుగ వస్తున్న వేళ బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి భారీ ఊరట కలిగింది. దీపావళికి మరో కొద్ది రోజులు మాత్రమే సమయం ఉంది. అంతేకాక పెళ్లిళ్ల సీజన్ కూడా మొదలుకానున్న క్రమంలో చాలామంది పసిడి కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ తరుణంలో పసిడి ధరలు పడిపోతుండటం ఊరట కలిగించే పరిణామంగా చెప్పవచ్చు. అమెరికా ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ నవంబర్‌లో జరగనున్న తమ సమీక్ష సమావేశంలో వడ్డీ రేట్లను మరోసారి పెంచే ఛాన్స్ ఉందనే అంచనాలు వెలవ డుతున్నాయి. దీంతో పాటు అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు, డాలర్ విలువ పెరుగుతుండటం బంగారం ధరల పతనానికి కారణమవుతోంది. అక్టోబర్ 26న సోమవారం ధరలు స్వల్పంగా పడిపోయాయి. వివిధ ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది చూద్దాం.బంగారం ధరలు ఇలా..-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,570 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,30,690గా ట్రేడవుతోంది.-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,42,570గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,30,690 పలుకుతోంది.-దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన మేలిమి బంగారం ధర రూ.1,42,720గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,30,840కు లభిస్తోంది.-చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,570గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,30,690 వద్ద ట్రేడవుతోంది.-బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,570గా ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,30,690 వద్ద ట్రేడవుతోంది.

-ముంబైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,42,570 వద్ద ట్రేడవుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1,30,690గా ఉంది.

వెండి రేట్లు తెలుగు రాష్ట్రాల్లో ఎలా ఉన్నాయంటే..?-బెంగళూరులో కేజీ సిల్వర్ ధర రూ.2,19,900 వద్ద కొనసాగుతోండగా.. నిన్న ఈ రేటు రూ.2.20 లక్షల వద్ద స్థిరపడింది.-చెన్నైలో కేజీ వెండి ధర రూ.2,19,900 వద్ద కొనసాగుతోంది.-హైదరాబాద్‌లో కిలో సిల్వర్ రేటు రూ.2,19,900గా ఉంది.-దేశ రాజధాని ఢిల్లీలో కేజీ వెండి రూ.2,19,900 వద్ద కొనసాగుతోంది

ఒంటి చేత్తో కళ్లు చెదిరే క్యాచ్.. అరంగేట్రంలోనే అదరగొట్టిన బౌలర్..!

ఇంగ్లండ్‌తో ట్రై సిరీస్ వన్డేలో పాకిస్థాన్ యువ పేసర్ రాజవుల్లా అద్భుతమైన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. నసీమ్ షా మ్యాచ్‌కు ముందు గాయపడటంతో చివరి నిమిషంలో తుది జట్టులో చోటు దక్కించుకున్న రాజవుల్లా, బంతితో పాటు ఫీల్డింగ్‌లోనూ తన సత్తా చూపించాడు.ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో విల్ జాక్స్, బెన్ డకెట్ కలిసి పాకిస్థాన్ బౌలర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. ఆరో వికెట్‌కు జాక్స్, డకెట్ కలిసి 30 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో ఇంగ్లండ్ పరిస్థితి మెరుగుపడుతోంది. ఈ సమయంలోరాజవుల్లాను తిరిగి బౌలింగ్‌కు తీసుకురావడం పాకిస్థాన్‌కు కలిసొచ్చింది.రాజవుల్లా వేసిన బంతి మిడిల్, లెగ్ స్టంప్‌ల వైపు మంచి లెంగ్త్‌లో వచ్చింది. జాక్స్ దాన్ని ఫ్లిక్ చేసే ప్రయత్నంలో బ్యాట్ ముఖాన్ని ముందుగానే మూసేశాడు. దీంతో బంతి బ్యాట్ అంచును తాకి రాజవుల్లా ఎడమవైపు దూసుకెళ్లింది.ఈ వికెట్ రాజవుల్లా వన్డే కెరీర్‌లో తొలి వికెట్ కావడం మరో ప్రత్యేకత. జాక్స్‌ను అవు చేసిన తర్వాత కూడా అతడు ఆగలేదు. లియామ్ డాసన్‌ను కూడా పెవిలియన్‌కు పంపి ఇంగ్లండ్‌పై పాకిస్థాన్ ఒత్తిడిని పెంచాడు.అంతర్జాతీయ స్థాయిలో రాజవుల్లా ఎదుగుదల..కొన్ని నెలల క్రితం వరకు పెద్దగా పరిచయం లేని రాజవుల్లా, తన



వేగంతో వేగంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడి బౌలింగ్ వేగం, యాక్షన్‌ను పాకిస్థాన్ దిగ్గజ పేసర్ వకార్ యూనిస్‌తో పోల్చడం మొదలైన తర్వాత అతడి పేరు ఎక్కువగా వినిపించింది.ఇంగ్లండ్ పర్యటనలో బ్యాటింగ్‌లోనూ అతడు మెరుపులు చూపించాడు. బౌలర్లపై దూకుడుగా ఆడి పలు రికార్డులను నమోదు చేశాడు. అతడి ప్రతిభను గుర్తించిన పాకిస్థాన్ సెలెక్టర్లు టీ20, వన్డే జట్లలో చోటు కల్పించారు.శ్రీలంకతో టీ20 మ్యాచ్‌లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన రాజవుల్లా, ఇంగ్లండ్‌తో జరిగిన ట్రై సిరీస్ మ్యాచ్‌లో వన్డేల్లోకి అడుగుపెట్టాడు. గంటకు సుమారు 145-147 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించగల సామర్థ్యం అతడికి ఉంది. ఈ వేగంతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల యువ పేసర్‌గా రాజవుల్లా ఎదుగుతున్నాడు.

ఈఎంఐలు చెల్లించేవారికి బ్యాడ్ న్యూస్.. ఆర్బీఐ మరో కీలక నిర్ణయం.

లోన్లు తీసుకున్నవారికి ఆర్బీఐ మరో షాక్ ఇవ్వనుందా..? త్వరలో ఆర్బీఐ మరోసారి వడ్డీ రేట్లను పెంచనుందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ద్రవ్య విధాన పరపతి సమావేశాల్లో ఆర్బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. అయితే ఫిబ్రవరి 2027 నాటికి వడ్డీ రేట్లను మరింత పెంచే అవకాశముందనే అంచనాలు వెలువడుతున్నాయి. దీనికి కారణాలు ఏంటో చూద్దాం.వచ్చే ఏడాది 2027 ఫిబ్రవరి నాటికి ఆర్బీఐ రెపో రేటును మరో 50 బేసిస్ పాయింట్ల మేర పెంచే అవకాశముందని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనా వేసింది. ఈ మేరకు తాజాగా ఒక రిపోర్ట్ విడుదల చేసింది. ఈ నివేదికలో ఆ అంశాన్ని పొందుపర్చింది. దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న క్రమంలో వడ్డీ రేట్లు పెంచక తప్పని పరిస్థితి నెలకొందని నివేదికలో పేర్కొంది.ఆర్బీఐ అక్టోబర్‌లో జరిగిన సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో 5.25 శాతం నుంచి 5.50 శాతానికి వడ్డీ రేట్లు చేరుకున్నాయి. దీని వల్ల బ్యాంకులు ఇటీవల వడ్డీ రేట్లను పెంచాయి. దీంతో లోన్లు చెల్లించేవారికి నెలవారీ ఈఎంఐలు పెరిగాయి. కొత్తగా లోన్ తీసుకునేవారికి కూడా అధిక వడ్డీ



రేట్లు పడుతున్నాయి. ఇది సామాన్యులపై భారాన్ని మోపుతోంది.ప్రస్తుతం దేశంలో దిగుమతి వ్యయాలు పెరగడంతో పాటు ప్రపంచ ఆర్థిక పరిణామాల క్రమంలో దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాల్సిన బాధ్యత ఆర్బీఐపై ఉంటుంది. దీంతో ద్రవ్యలోటును నియంత్రించేందుకు, ధరల స్థిరత్వాన్ని ప్రోత్సహించేందుకు రాబోయే ద్రవ్య పరపతి విధాన సమీక్షలో కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేయనుంది. ద్రవ్యల్బణాన్ని తగ్గించేందుకు కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశముంది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



బిగ్‌బాస్‌తో ఓవర్ నైట్ క్రేజ్..



తెలుగు బుల్లితెరపై రియాలిటీ షోల హవా గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా బిగ్‌బాస్ షో ద్వారా ఎంతోమంది సామాన్యులు సెలబ్రిటీలుగా మారుతుంటారు. అయితే ఈ షో అందరికీ ఒకేలా కలిసి రాదు. ఆటతీరు, మాటతీరుతో కొందరు ప్రశంసలు అందుకుంటే, మరికొందరు విమర్శలను ఎదుర్కొంటూనే భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదిస్తారు. అలాంటి జాబితాలో ముందుండే నటీమణుల్లో రతికా రోజ్ ఒకరు. బిగ్‌బాస్‌తో విపరీతమైన క్రేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం సోషల్ మీడియాలో సందడి చేస్తుంది.

తెలంగాణలోని వికారాబాద్ జిల్లాకు చెందిన ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన రతికా రోజ్.. చిన్నతనం నుంచే నటనపై ఉన్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కాలేజీలో బీటెక్ పూర్తి చేసిన ఆమె, మోడలింగ్ రంగంలోకి ప్రవేశించి తన ప్రతిభను నిరూపించుకుంది. ఆ తర్వాత బుల్లితెరపై కొన్ని అవకాశాలు దక్కించుకుంటూ, క్రమంగా సినిమా రంగం వైపు అడుగులు వేసింది.2020లో విడుదలైన బొమ్మ అదిరింది సినిమాతో రతిక సిల్వర్ స్క్రీన్ ప్రయాణం ప్రారంభమైంది. షకలక శంకర్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటించి ప్రేక్షకులను మెప్పించింది. ఆ తర్వాత బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వచ్చిన 'నేను స్టూడెంట్ సర్!' చిత్రంలో లేడీ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కీలకమైన రోల్ పోషించి అందరి దృష్టిని ఆకర్షించింది. సినిమాలతో కెరీర్ సాగుతున్న తరుణంలోనే బిగ్‌బాస్ తెలుగు సీజన్ 7లో కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చి సంచలనం సృష్టించింది రతికా రోజ్. హౌస్‌లో ఆమె ఆటతీరు, తోటి కంటెస్టెంట్లతో జరిగిన వివాదాలు, ఎమోషనల్ మూమెంట్స్ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ షో ద్వారా ఆమెకు పాపులారిటీ విపరీతంగా పెరిగినప్పటికీ, అదే స్థాయిలో విమర్శలు, ట్రోల్స్‌ను కూడా ఎదుర్కొవాల్సి వచ్చింది. ఏదేమైనా తెలుగు రాష్ట్రాల్లోని టెలివిజన్ ప్రేక్షకులకు ఈ బ్యూటీ సుపరిచితురాలైంది.బిగ్‌బాస్ తర్వాత ఆమెకు వెండితెరపై ఆశించిన స్థాయిలో అవకాశాలు తగ్గాయనే చెప్పాలి. సోషల్ మీడియాలో మాత్రం ఆమె ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ రకరకాల ట్రెండీ వేర్స్, మోడరన్ అండ్ గ్లామరస్ ఫొటోషూట్లతో నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఆమె షేర్ చేసే కొత్త లుక్స్ క్షణాల్లో వైరల్ అవుతుంటాయి. మరి రాబోయే రోజుల్లో రతికా రోజ్ ఎలాంటి క్రేజీ ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు వస్తుందో వేచి చూడాల్సిందే.!

ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైన వెంకీ



త్రివిక్రమ్ మూవీ.. కొత్త రిలీజ్ డేట్ ఇదే

టాలీవుడ్‌లో విక్టరీ వెంకటేష్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలతో ప్రేక్షకులను అలరించడంలో ఆయనది ప్రత్యేకమైన శైలి. మరోవైపు, తనదైన మాటలు, కథాకథనం, వినోదంతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఆదర్శ కుటుంబం: హౌస్ నెం. 47' కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ ను వెంకటేష్ సోషల్ మీడియా వేదికగా అనౌన్స్ చేశారు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై మొదటి నుంచే మంచి అంచనాలు నెలకొన్నాయి. తొలుత ఈ చిత్రాన్ని అక్టోబర్ 2న విడుదల చేయాలని మేకర్స్ భావించారు. ఆ తర్వాత అక్టోబర్ 9కు వాయిదా వేశారు. అయితే అనుకున్న సమయానికి సినిమా థియేటర్లలోకి రాకపోవడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు.సినిమాకు సంబంధించిన కొన్ని పనులు , టెక్నికల్ వర్క్ సంబంధించిన అంశాల కారణంగా విడుదలను మరోసారి వాయిదా వేశారు. ఫైనల్ గా ఈ సినిమాను అక్టోబర్ 30న విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమైంది. వరుస వాయిదాలతో ఎదురుచూస్తున్న అభిమానులకు ఈ వార్త ఊరటనిస్తోంది. వెంకటేష్, త్రివిక్రమ్ గతంలో రచయితగా వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించినప్పటికీ, దర్శకుడిగా త్రివిక్రమ్‌తో వెంకటేష్ చేస్తున్న ఈ చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కుటుంబ కథలు, వినోదాత్మక సన్నివేశాలు, భావోద్వేగాలను తెరపై అద్భుతంగా చూపించడంలో వెంకటేష్‌కు మంచి పేరుంది. త్రివిక్రమ్ తనదైన సంభాషణలు, కథనంతో ఈ సినిమాను ఎలా తీర్చిదిద్దారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

ఆరోవారం ఓటింగ్‌లో దుమ్మురేపుతోన్న రోహిత్.. డేంజర్ జోన్‌లో ఆ ఇద్దరు..



బిగ్ బాస్ ఇంట్లో మూడో వారం కెప్టెన్సీ కంటెండర్ టాస్కులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కంటెస్టెంట్ల మధ్య పోటీ, గొడవలు, భావోద్వేగాలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు ఇంటి సభ్యుల ఆటతీరుపై బయట ప్రేక్షకుల్లో ఉన్న అభిప్రాయాలను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూపించడం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా షాలినీ, రాం ప్రసాద్, త్రిగుణ్, వర్షిణి, సుధీర్‌లపై వచ్చిన కామెంట్లు ఇంట్లో చర్చకు దారితీశాయి. కెప్టెన్సీ కంటెండర్ టాస్కుల్లో భాగంగా రెండు బజర్‌లను ముందుగా ఎవరు టచ్ చేశారనే దానిపై నరేష్, వంశీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని తేల్చే బాధ్యత త్రిగుణ్‌పై పడింది. మొదట నరేష్ ముందుగా బజర్ పట్టుకున్నాడని చెప్పిన త్రిగుణ్.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. చివరకు వంశీనే ముందుగా బజర్ టచ్ చేశాడని ప్రకటించాడు. ఒకవేళ తన నిర్ణయం తప్పయితే దానికి తానే బాధ్యత వహించి పనిష్మెంట్ తీసుకుంటానని త్రిగుణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది.

మరో టాస్క్‌లో వంశీ, ఝాన్సీ పోటీ పడగా.. ఝాన్సీ విజయం సాధించింది. దీంతో ఆమెకు కెప్టెన్సీ కంటెండర్‌గా నిలిచే అవకాశం రావడంతో పాటు ఫ్యామిలీ ఫోటోను పొందే ఛాన్స్ కూడా దక్కింది. అయితే తనకు లభించిన ఆప్షన్స్‌లో నరేష్‌కు సంబంధించిన లెటర్‌ను ఎంచుకున్న ఝాన్సీ.. దాన్ని ముక్కలు చేయడంతో నరేష్‌కు టెన్షన్ మొదలైంది. తర్వాత కంటెస్టెంట్లకు కాస్త రిలీఫ్ ఇచ్చేలా గార్డెన్ ఏరియాలోకి బిగ్ బాస్ భారీగా ఫుడ్ పంపించాడు. ఇంటి సభ్యులంతా కలిసి ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. కానీ ఆ ఆనందం



అతడు లేకపోతే నేను ఇండస్ట్రీకి వచ్చేవాడినే కాదు.. హీరో సుమన్ ఎమోషనల్ కామెంట్స్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో 80వ దశకంలో యాక్షన్, రొమాంటిక్ హీరోగా విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న నటుడు సుమన్. తనదైన గ్లామర్, కరాటే విద్యతో ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్న సుమన్ ఓ ఇంటర్వ్యూలో తన తొలి నాటి సినీ జ్ఞాపకాలను, ఎదుర్కొన్న సవాళ్లను పంచుకున్నారు. సినిమా ఇండస్ట్రీలోకి తన ఎంట్రీకి కారణమైన కార్ మెకానిక్ కిట్టుని సుమన్ ఎప్పటికీ మర్చిపోలేనని తెలిపారు. కిట్టు గారి సహాయం వల్లే తాను సినీ రంగానికి పరిచయమయ్యానని అన్నారు. కిట్టు సినిమా ప్రపంచంలోనే ఉంటూ సినీ ప్రముఖులకు కార్ ట్రావెల్స్ సేవలు, స్థలాల కొనుగోళ్లలో సహాయం చేసేవారని చెప్పారు. సుమన్ కెరీర్ ప్రారంభంలో ఆయన ఎంతో తోడ్పడ్డారు. అయితే, కిట్టు చనిపోయిన తర్వాతే ఆయన ఫ్యామిలీ నేపథ్యం గురించి తెలిసిందని, సుమన్ ఎప్పుడూ ఇతరుల పర్సనల్ విషయాల్లో జోక్యం చేసుకోనని స్పష్టం చేశారు.తనకు మొదట్లో నటన, డ్యాన్స్ తెలియవని, కేవలం కరాటే బ్లాక్ బెల్ట్ ఉన్న ఏకైక అర్హతతో ఇండస్ట్రీలోకి వచ్చానని సుమన్ వెల్లడించారు. ప్రొడ్యూసర్, డైరెక్టర్ టి.ఆర్. రామన్న గారు తన కరాటే నైపుణ్యాన్ని చూసి అవకాశం ఇచ్చారని తెలిపారు. అయితే, సినిమా షూటింగ్‌లలో కెమెరాకు ఓవర్‌లాప్ చేస్తూ నిజంగా కొట్టకుండా ఫైట్ చేసే టెక్నిక్ మొదట్లో సుమన్‌కు తెలియకపోవడంతో, తొలి సినిమా ఫైట్ సీన్‌లో ఓ ఫైటర్‌కు పంచ్ గట్టిగా తగిలి రెండు మూడు పళ్లు ఎగిరిపోయాయని సరదాగా గుర్తు చేసుకున్నారు. ఉల్టాగా తానే నిజమైన ఎక్స్‌ప్రెషన్స్ కోసం ఫైటర్లను గట్టిగా కొట్టమని కోరేవాడినని, ఆ తర్వాతే రీల్ ఫైట్ మెళకువలు నేర్చుకున్నానని చెప్పారు.తెలుగులో భానుచందర్ ద్వారా తమ్మారెడ్డి భరద్వాజ పరిచయం అయ్యారని, 'ఇద్దరి కిలాడీలు' సినిమా ఆలస్యం కావడంతో రేలంగి నరసింహారావు దర్శకత్వంలో వచ్చిన 'తరంగిణి' సుమన్ తొలి తెలుగు చిత్రంగా విడుదలైందని తెలిపారు. కేవలం 18 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న 'తరంగిణి' ఏకంగా ఒక సంవత్సరం పాటు థియేటర్లలో ఆడి సంచలనం సృష్టించిందని చెప్పారు. ఇక 1984 కాలంలో ఇతర యువ హీరోలతో పోలిస్తే అత్యధిక రెమ్యునరేషన్ అందుకున్నారనే ప్రచారంపై స్పందిస్తూ, తాను ఎప్పుడూ డబ్బును చూసి సినిమాలు చేయలేదని, కథ, క్యారెక్టర్ బాగుంటేనే ఒప్పుకునేవాడినని తెలిపారు. మార్కెట్ పెరిగినప్పుడు రెమ్యునరేషన్ ఆటోమేటిక్‌గా వస్తుందని సుమన్ వివరించారు.



ఏం సినిమా రా నాయనా.100 కోట్లతో బాక్సాఫీస్ సెన్సేషన్.

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో పెద్ద హీరోల సినిమాలు, వందల కోట్ల భారీ బడ్జెట్ చిత్రాలు మాత్రమే రికార్డులు సృష్టిస్తాయనే అపోహను ఎప్పుడూ కొన్ని చిన్న సినిమాలు పటాపంచలు చేస్తుంటాయి. కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు చిన్న సినిమా పెద్ద సినిమా అనే తేడా చూడకుండా బ్రహ్మరథం పడతారు అనడానికి కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన ఒక సరికొత్త చిత్రం అద్దం పడుతోంది. ఎటువంటి భారీ అంచనాలు లేకుండా, కేవలం రూ. 2.5 కోట్ల ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభంగా జరగలేదు. సినిమా నిర్మాణం సమయంలో దర్శకుడు, నిర్మాతలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక ఇబ్బందులు తారస్థాయికి చేరినప్పుడు సినిమా పూర్తి చేయడం కోసమే ఏకంగా కుటుంబ సభ్యుల ఆభరణాలను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక విడుదలకు ముందు థియేటర్లు దొరక్క, పెద్దగా ప్రమోషన్స్ చేయడానికి కూడా బడ్జెట్ లేక మేకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఈ స్థాయికి చేరుకోవడం అంత సులభంగా జరగలేదు. సినిమా నిర్మాణం సమయంలో దర్శకుడు, నిర్మాతలు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆర్థిక ఇబ్బందులు తారస్థాయికి చేరినప్పుడు సినిమా పూర్తి చేయడం కోసమే ఏకంగా కుటుంబ సభ్యుల ఆభరణాలను తాకట్టు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక విడుదలకు ముందు థియేటర్లు దొరక్క, పెద్దగా ప్రమోషన్స్ చేయడానికి కూడా బడ్జెట్ లేక మేకర్స్ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.తొలి రోజు కేవలం కొన్ని థియేటర్లలోనే విడుదలైన ఈ చిత్రం, ప్రేక్షకులకు రీచ్ కావడం కోసం వినూత్న రీతిలో వివాహ ఆహ్వాన పత్రికల మాదిరిగా కరపత్రాలు పంచుతూ ప్రజలను సినిమా చూడమని కోరాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే సినిమా విడుదలైన మొదటి ఆట నుంచే మౌత్ టాక్ అద్భుతంగా పనిచేసింది. ప్రేక్షకులు సినిమాకు బ్రహ్మరథం పట్టడంతో క్రమక్రమంగా షోల సంఖ్య పెరుగుతూ వచ్చింది. చిన్న సినిమాగా వచ్చి ఊహించని విధంగా కలెక్షన్ల సునామీ సృష్టించిన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ. 100 కోట్లకు పైగా ప్రపంచవ్యాప్త వసూళ్లను సాధించి అందరినీ విస్మయానికి గురిచేసింది.



అడియన్స్ అనుకున్నదే జరిగింది.. బిగ్ బాస్?లో డబుల్ ఎలిమినేషన్

తెలుగు బుల్లితెరపై అత్యంత ఆదరణ పొందిన రియాలిటీ షో 'బిగ్‌బాస్ తెలుగు 10' రోజురోజుకీ ఉత్కంఠభరితంగా మారుతోంది. కింగ్ నాగార్జున వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ షోలో ప్రతీ వారం ఊహించని మలుపులు, ట్విస్టులు ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. కాగా, 7వ వారానికి సంబంధించి బిగ్‌బాస్ హౌస్‌లో అత్యంత అనూహ్యమైన పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ వారం ఏకంగా 'డబుల్ ఎలిమినేషన్' జరిగి నలుగురికీ పెద్ద షాక్ ఇచ్చిందని తెలుస్తోంది. ఈ వారం నామినేట్ అయినవారిలో త్రిగుణ్, సింగర్ ఝాన్సీ, రామకృష్ణ, శ్వేత, టెంపర్ వంశీ, దక్షి, శివకుమార్, నీతూ నటరాజ్ అయ్యారు. ఈ వారం జరిగిన ఓటింగ్‌లో రోహిత్, త్రిగుణ్, అమన్, రామకృష్ణ అత్యధిక ఓటింగ్‌ను సాధించి సేఫ్ జోన్‌లో నిలిచారు. అయితే చివరి స్థానాల్లో నీతూ నటరాజ్, శివకుమార్, దక్షి గుత్తికొండ నిలవడంతో ఎలిమినేషన్ కత్తి వారిపైనే వేలాడింది.అయితే ఇప్పటికే దక్షి ఎలిమినేట్ అయ్యింది. ఇందుకు సంబంధించిన ప్రోమోను సైతం మేకర్స్ రిలీజ్ చేశారు. ఇక ఇప్పుడు నెట్టింట వినిపిస్తున్న టాక్ ప్రకారం ఈ వారం మరో ఎలిమినేషన్ ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే అడియన్స్ ఓటింగ్ కాదు.. ఈసారి హౌస్మేట్స్ నిర్ణయం ప్రకారం కంటెస్టెంట్ బయటకు రానున్నట్లు తెలుస్తోంది. వీకెండ్ ఎపిసోడ్‌లో హోస్ట్ నాగార్జున కంటెస్టెంట్ల ఆటతీరుపై, వారి ప్రవర్తనపై తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యంగా త్రిగుణ్, రోహిత్‌ల ప్రవర్తనతో పాటు షాలిని వ్యవహరించిన తీరుపై నాగ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఓ దశలో నాగార్జున హెచ్చరించిన తీరుతో షాలిని హౌస్ నుంచి బయటకు వెళ్ళిపోతానని చెప్పడం,

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224